# టైమ్స్ ఆఫ్ వార్త

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : మంజులా దాసు

తెలంగాణ మంగళవారం, 08 - ఏప్రిల్ - 2025 సంపుటి : 16 సంచిక : 249 పేజీలు 08 వెల : 6/-




6లో..

## ముదురుతున్న ఎండలు.. ఉద్యోగుల బేజారు..

## మే 7 నుంచి ఆర్టీసీ కార్మికుల సమ్మె

- సమస్యల పరిష్కారానికి మరో మార్గం లేదు
- చలో లేబర్ కమిషనరేట్ ఆందోళనలో జేఏసీ నేతలు



టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మే 7వ తేదీ అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్టు టీజీఎస్ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు ప్రకటించారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఆర్టీసీ యాజమాన్యం, కార్మిక శాఖ కమిషనర్‌కు సమాచారాన్ని ఇచ్చామని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే పలురూపాల్లో ప్రభుత్వం, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామనీ, చర్చలు జరపాలని లేబర్ కమిషనర్‌ను కోరామనీ, రకరకాల సాకులు చెప్తూ యాజమాన్యం కాలయాపన చేసిందే తప్ప, చర్చలకు రాలేదన్నారు. కార్మికుల పక్షాన నిలవాల్సిన కార్మిక శాఖ కూడా యాజమాన్యానికే వత్తాసు పలుకుతున్నదని

మిగతా 7లో..

## కొత్త ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :



ఎమ్మెల్యే కోటాలో గెలిచిన ఎమ్మెల్సీలతోపాటు ఉపాధ్యా య, పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి విజయం సాధించిన కాంగ్రెస్, బీజేపీ, సీపీఐకి చెందిన ఏడుగురు ఎమ్మెల్సీలు ప్రమా ణం స్వీకారం చేశారు. కొత్త ఎమ్మెల్సీలతో శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తన చాంబర్‌లో ప్రమాణం చేయించారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా కాంగ్రెస్ నుంచి ఏకగ్రీవం గా ఎన్నికైన విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, నెల్లికంటి సత్యంతో చైర్మెన్ ప్రమాణ స్వీకారం చేయించారు. పీఆర్‌టీయూ నుంచి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన పింగిలి శ్రీపాల్‌రెడ్డి, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియో జకవర్గాల నుంచి గెలిచిన మల్కా కొమురయ్య, అంజిరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్ర మానికి రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, సీపీఐ నుంచి పల్లా వెంకట్‌రెడ్డి, ఉజ్జిని యాదగిరిరావు, ఉజ్జిని రత్నాకర్‌రావు, పల్లా నర్సింహారెడ్డి, నెల్లికంటి సత్యం భార్య అన్నపూర్ణ, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీలు లక్ష్మణ్, రఘునందన్‌రావు తదితరులున్నారు.

# ప్రమాదకర స్థాయిలో అప్పుల భారతం

### పేదల బ్రతుకులు ఆగం.. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపు

> ప్రమాదకర స్థాయిలో అప్పులు చేసి పప్పు కూడు బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం తినిపిస్తుందని, దేశ జనాభా 142 కోట్లు ఉండగా మోడీ ప్రభుత్వం చేసిన అప్పులు రూ.239 లక్షల కోట్లు అని తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఐలయ్య వివరించారు. కాగా 67 సంవత్సరాల పాటు భారతదేశాన్ని పాలించిన కాంగ్రెస్ రూ.54 లక్షల కోట్లు అప్పులు చేయగా, 11 సంవత్సరాల నుండి పాలిస్తున్న మోడీ ప్రభుత్వం రూ.185 లక్షల కోట్లు అని ఆయన వ్యంగంగా ఆరోపించారు.

- ఒకవైపు దేశ ప్రజల విభజనకు బిజెపి కుట్ర
- మరోవైపు ఎడ పేడా పెట్రోల్, డీజిల్, ఎల్పిజి గ్యాస్ ధరల పెంపు
- ప్రమాదకర స్థాయిలో అప్పుల భారతం నరేంద్ర మోడీ ప్రభుత్వం
- దేశ జనాభా 142 కోట్లు.. దేశ అప్పు 239 లక్షల కోట్లు
- 67 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో 54 లక్షల కోట్లు,11 ఏళ్ల మోడీ ప్రభుత్వం చేసిన అప్పు 185 లక్షల కోట్లు
- పెట్రోల్, డీజిల్, ఎల్పిజి గ్యాస్ ధరల పెంపుపై మండిపడ్డ కాంగ్రెస్
- భారీ నిరసన ఉద్యమానికి కాంగ్రెస్ సమయతం
- తెలంగాణ ప్రభుత్వ విప్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మండిపాటు
- టైమ్స్ ఆఫ్ వార్త ప్రత్యేక ప్రతినిధి ఖాజా భాయితో బిర్ల ఐలయ్య





టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా ప్రజలు మండుతున్న ఎండలకు, ఉక్కపోత కు ఉక్కిరిబిక్కిరి అవుతున్న తరుణాన కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోల్ డీజిల్, ఎల్పిజి వంటగ్యాస్ ధరలను పెంచుతూ తీసుకున్న నిర్ణయం పుండుమీద కారం చల్లిన చందాన ఉందని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విప్, ఆలేరు ఎమ్మెల్యే, కాంగ్రెస్ అధికార ప్రతినిధి బీర్ల ఐలయ్య విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తులపై ధరలను పెంచుతూ ప్రకటించిన నేపథ్యంలో ఆయనతో టైమ్స్ ఆఫ్ వార్త ప్రత్యేక ప్రతినిధి కలిసి మాట్లాడారు. నరేంద్ర మోడీ మిత్రుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన తారీఫ్ ల పెంపుతో దేశ స్టాక్ మార్కెట్ పతనమౌతున్న దశలో ఉరిమి ఉరిమి కేంద్రంపిడుగు దేశ ప్రజలపై పడినట్లుగా దేశ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, ఎల్పిజి వంట గ్యాస్ ధరలను పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో సామాన్య ప్రజల బ్రతుకు గుది బండగ మారుతున్నది బిర్ల ఐలయ్య ఆవేదన వ్యక్తపరిచారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ రేట్లు ఇటీవల కాలంలో భారీగా దిగివస్తున్న తరుణాన, ఆర్థిక మాధ్యం, వాణిజ్య యుద్ధ భయాల నేపథ్యంలో చమురు ధరలు తగ్గి రేట్లు పడిపోతున్నాయని,

ఈ తరుణాన కేంద్రంలోని నరేంద్ర మోడీ ఎన్‌డిఏ ప్రజా వ్యతిరేక ప్రభుత్వం దేశీయంగా పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించకుండా సబ్సిడీల పై కేంద్రం ఇస్తున్న ధరల కారణంగా రూ.43,000 కోట్ల చమురు మార్కెటింగ్ కంపెనీలు ఎదుర్కొంటున్న నష్టాలను భర్తీ చేసేందుకు ధరలను పెంచడం జరుగుతుందని కేంద్రమంత్రి స్పష్టం చేయడం, కేంద్ర ప్రభుత్వం సంపన్నుల కోసమే కానీ పేద ప్రజల కోసం కాదని మరో మారు రుజువు చేశారని తెలంగాణ

మిగతా 7లో..



హెచ్‌సియు విద్యార్థులపై

## కేసుల ఉపసంహారణ

- పోలీసులకు డిప్యూటీ సిఎం భట్టి ఆదేశాలు
- బలగాల ఉపసంహారణకు ప్రభుత్వం నిర్ణయం
- ఆ మేరకు వైస్‌ఛాన్సలర్‌కు భట్టి లేఖ

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు పోలీసు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కంచె గచ్చిబౌలి సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల సబ్ కమిటీ సమావేశం సోమవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి కమిటీ సభ్యులు మంత్రులు దుదిల్లా శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు హాజరయ్యారు ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచందర్ రెడ్డిలు పాల్గొన్నారు. సబ్ కమిటీతో హైదరాబాద్ విశ్వవిద్యాలయ ఉపాధ్యాయ సంఘం(యుహెచ్‌టిఎ), పౌర సంఘాల ప్రతినిధులు సమావేశమై పలు డిమాండ్లను మంత్రుల కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. హెచ్‌సియు టీచర్స్ అసోసియేషన్, సివిల్ సొసైటీ గ్రూప్స్‌తో సబ్ కమిటీ సభ్యులతో చర్చించిన అనంతరం డిప్యూటీ సిఎం పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. జ్యూడిషియల్ రిమాండ్‌లో ఉన్న ఇద్దరు విద్యార్థులకు సంబంధించి కేసుల ఉపసంహరణకు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు.

మిగతా 7లో..

# దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించే కుట్ర

### ఐక్య పోరాటాలతో ఎదుర్కోవాలి : ఎంఎల్‌సి కోదండరాం

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :



పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన కేవలం నియోజకవర్గాల సరిహద్దులు మార్చడమే కాదు, దేశ రాజకీయ భవిష్యత్తును రూపుదిద్దే కీలక ఘట్టమని తెలంగాణ జనసమితి అధ్యక్షులు, ఎంఎల్‌సి ప్రొ. కోదండరాం అన్నారు. బిజెపి ప్రభుత్వం తెస్తున్న పునర్విభజన దక్షిణాది రాష్ట్రాల ప్రజాస్వామిక ప్రాతినిధ్యాన్ని నెమ్మదిగా తగ్గించాలనే కుట్ర అని ఆయనన్నారు. ఇందుకు రాజకీయ శక్తులు ఎంతో సూటిగా పనిచేస్తున్నాయని. దీనిని ఎదుర్కొనాలంటే ప్రజలు, రాజకీయ పార్టీలు, విద్యావంతులు, సమాజ బలగాలు అన్ని కలసి పోరాటం చేయాలని కోదండరాం పిలుపునిచ్చారు. తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ బేగంపేటలోని టూరిజం ప్లాజాలో 'పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన, - దక్షిణ భారత భవిష్యత్తు' అనే అంశంపై రాష్ట్రస్థాయి సెమినార్ జరిగింది. ఎంఎల్‌సి కోదండారం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు, సామాజిక కార్యకర్తలు, విశ్లేషకులు పాల్గొని బిజెపి తెస్తున్న పార్లమెంటరీ పునర్విభజనపై ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విసికె పార్టీ జాతీయ అధ్యక్షులు, చిదంబరం ఎంపీ డా. తిరుమావళవన్ మాట్లాడుతూ ప్రస్తుతం జరిగే పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన అనేది దేశానికి అతి ముఖ్యమైందని అన్నారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ హితం కొరకు జనాభా నియంత్రణనను పకడ్బందీగా అమలుచేసిన దక్షిణాది రాష్ట్రాలకు ఇది ఒక శాపంగా మారుతుందన్నారు. మోడీ ప్రభుత్వం పునర్విభజన పేరుతో ఉత్తరాది రాష్ట్రాలలో ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల లోక్ సభ సీట్లను భారీగా పెంచాలని కుట్రలు చేస్తుందని ఆరోపించారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంటులో రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిపోతుందని అన్నారు. హిందూమతం ఒక వ్యక్తిగత విశ్వాసమైతే, హిం దూత్వవాదం మాత్రం ఆర్ఎస్ఎస్ రాజకీయ ఐడియాలజీ అని, బిజెపి దానిని ప్రయోజనంగా మార్చుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు, ఆదివాసులు, ముస్లింల ఓట్లు అధికంగా ఉన్న నియోజక వర్గాలను విభజన చేసి, అశాస్త్రీయంగా వాటి సరిహద్దులను కూడా మార్చడానికి కుట్రలు చేయబోతుందని ఆరోపిం చారు. అందుకే దక్షిణాది రాష్ట్రాలు పునర్విభజన పట్ల అప్ర మత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తమిళనాడు విల్లుపురం ఎంపీ డి.రవి కుమార్ మాట్లాడుతూ పునర్వి భజనను కేంద్ర ప్రభుత్వం ఒక ఆయుధంగా ఉపయోగిం చాలని చూస్తోందన్నారు.

## నేడు ఇందిరాపార్కు వద్ద కవిత దీక్ష

- అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్
- ఏర్పాట్లను పరిశీలించిన జాగృతి, యూనైటెడ్ పూలే ఫ్రంట్ నాయకులు

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం ఇందిరాపార్కు వద్ద దీక్ష చేపట్టనున్నారు. తెలంగాణ జాగృతి, యూనైటెడ్ పూలే ఫ్రంట్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించనున్న ఈ దీక్ష ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనున్నది. సోమవారం తెలంగాణ జాగృతి నాయకులు నవీన్ ఆచారి, యూపీఎఫ్ కో కన్వీనర్ బొల్ల శివశంకర్ నేతృత్వంలో నాయకులు ఇందిరాపారు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. బీసీల ఆత్మబంధువు పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని చాలాకాలం నుంచి ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేస్తున్నారు. పలుసార్లు ధర్నాలు, దీక్షలు నిర్వహించడమే కాకుండా విగ్రహ ఏర్పాటు ఆవశ్యకతపై పలు జిల్లాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు సైతం నిర్వహించారు. ఇదే అంశంపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను రెండుసార్లు కలిసి వినతిపత్రాలు అందజేశారు. అయినా, ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించారు. ఈ నెల 11న పూలే జయంతిలోగా విగ్రహం ఏర్పాటుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరాపారు వద్ద బొల్ల శివశంకర్ మీడియాతో మాట్లాడుతూ.. బీసీల విషయంలో ప్రభుత్వానికి చిన్నచూపు తగదని చెప్పారు. బీసీల ఆరాధ్య దైవమైన పూలే విగ్రహాన్ని చట్టసభల ఆవరణలో ఏర్పాటు చేసి గౌరవించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌ను ప్రభుత్వం విస్మరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, ఎమ్మెల్సీ కవిత నాయకత్వంలో పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. బీసీలను మోసం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
మంగళవారం,
08-04-2025


## అండర్ డ్రైనేజీ నిర్మాణంలో నాణ్యత లోపం

**తాడూరి శిరీష పరమేష్**
**12వ వార్డ్ మాజీ కౌన్సిలర్**

టైమ్స్ ఆఫ్ వార్త -
చౌటుప్పల్ రిపోర్టర్ గజం శ్రవణ్ నేత





చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలో అండర్ డ్రైనేజీ నిర్మాణాలు పనుల్లో భాగంగా చేపట్టిన అండర్ డ్రైనేజ్ లోకి వెళ్లిన వాటర్ ట్యాంకర్ చౌటుప్పల్ పట్టణ ప్రజలకు ఈ అండర్ డ్రైనేజీ ఎవరికి కూడా పెద్దగా ఉపయోగం లేని విధంగా,ఇష్టానుసారంగా వేస్తున్నారు అందులో కూడా నాణ్యత లోపం ఉంది దాదాపుగా ఇలాంటి సంఘటనలు రెండు మూడు జరిగాయి చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలో అధికారి గానీ, నాయకుడు గానీ పట్టించుకోవడం లేదు. పూర్తిగా నాణ్యత లోపంతో ఉందని తాడూరి శిరీష పరమేష్ అన్నారు.

## పుట్టపాక పద్మశాలి సంఘం భువనగిరి ఏడికి వినతి పత్రం అందజేత



టైమ్స్ ఆఫ్ వార్త - భువనగిరి రిపోర్టర్ గజం శ్రవణ్ నేత

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నేతన్న పొదుపు పథకంలో భాగంగా త్రిఫ్ట ఫండ్ పథకం కొరకు 447 జియో ట్యాగ్ కలిగిన చేనేత కళాకారులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 375 మందికి వెరిఫికేషన్ చేసి, కెనరా బ్యాంకు వారికి లిస్ట్ వచ్చినది. ఇతర కారణాల వలన 72 మంది జియో ట్యాగ్ కలిగిన చేనేత కళాకారులకు బ్యాంకు కు పంపించిన లిస్టులో పేరు రాలేదు. పెండింగ్లో ఉన్న 72 మంది జియో ట్యాగ్ కలిగిన చేనేత కళాకారులకు నేతన్న పొదుపు పథకంలో అర్హులు అయ్యే విధంగా చేయగలరని, నూతన జియో టాగ్ అవకాశాన్ని కల్పించగలరని కోరుతూ, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు శ్రీ చిక్క వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉపాధ్యక్షులు సామల భాస్కర్ కలిసి, పద్మశాలి సంఘం పుట్టపాక అధ్యక్షులు గజం హనుమంతు కార్యవర్గంతో కలిసి చేనేత మరియు జౌళి శాఖ సహాయ సంచాలకులు యాదాద్రి భువనగిరి వినతిపత్రం ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షులు తిరందాసు దశరథ, ప్రధాన కార్యదర్శి గూడెల్లి బాలరాజు, కోశాధికారి ఐటిపాముల శంకర్, గజం రమేష్, పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**బండ్ల శ్రీకాంత్ యాదవ్ బిఆర్ఎస్ యూత్ ప్రధాన కార్యదర్శి చౌటుప్పల్**

టైమ్స్ ఆఫ్ వార్త - చౌటుప్పల్ రిపోర్టర్ గజం శ్రవణ్ నేత



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల్లో భాగంగా ఇచ్చిన సంక్షేమ పథకాలను అమలు చేయాలి, మహిళలకు రూ. 2500లు ప్రతి నెల, ఆసరా పెన్షన్లను రూ.2000 నుండి రూ. 4000లు పెంచుతామని పెంచలేదు. విద్యార్థులకు స్కూటీలు అందించాలని, ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కెసిఆర్ కుటుంబం పైన కాకుండా పరిపాలన మీద దృష్టి పెట్టాలని ఇచ్చిన 420 హామీలు ఇవ్వాలని బండ్ల శ్రీకాంత్ యాదవ్ అన్నారు.

## శ్రీసీతారామ పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొన్న బండి రమేష్, జీవిఆర్

టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి



శ్రీ రామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్పల్లి గ్రామంలోని రామాలయంలో సీతారామచంద్రులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి శ్రీ సీతారామ పట్టాభిషేక మహోత్సవానికి హాజరైన కూకట్ పల్లి కాంగ్రెస్ ఇంచార్జి బండి రమేష్ పాల్గొన్నారు. ప్రజలందరికి శ్రీరాముడి పట్టాభిషేక మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు ,గూడెపు నాగరాజు, మేకల రమేష్, మాధవరం శ్రీనివాసరావు, మల్లేష్ యాదవ్, రాజు యాదవ్, శివాచౌదరి, సంజీవ రావు, కృష్ణవేణి, జ్యోతి, తదితరులున్నారు.

## పంచముఖి హనుమాన్ ఆలయంలో అన్నదానం

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-



పట్టణంలోని పాలచెట్టు ఏరియాలోని పంచముఖి హనుమాన్ దేవాలయంలో హనుమాన్ మాలధారణ స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఆలయంలో ఏర్పాటు చేసిన ఈకార్యక్రమంలో పట్టణానికి చెందిన చెప్పాల రమేష్ దంపతులు హనుమాన్ స్వాములకు అన్నదానం నిర్వహించారు. అంతకముందు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కృష్ణ చైతన్య ఆచార్య, హనుమాన్ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో హోరెత్తుతున్న జై బాపు, జై భీమ్, జై సమ్మిదన్ నినాదాలు


- మండలంలోని తుమ్మల చెరువు తండాల్లో జై బాపు, జై భీమ్ జై సమ్మిధాన్ ర్యాలీ..
- ప్రారంభించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు రావుల రాంరెడ్డి
- ముఖ్య అతిథిగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్
- జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆదేశాలను పాటీస్తు ఊరురా ర్యాలీలు
- దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్
- దున్నే వాడిదే భూమీ అని.. నాడు చాటిచెప్పిన పార్టీ కాంగ్రెస్
- నాడు సబ్బండ వర్గాల ధ్యేయమే కాంగ్రెస్ పార్టీ ఆకాంక్ష
- నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు.

టైమ్స్ ఆఫ్ వార్త - మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి



జై బాపు, జై భీమ్, జై సమ్మిధన్ కార్యక్రమాన్ని చిన్న గూడూరు మండలంలోని తుమ్మలచెరువు గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మారాబోయి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకులు రావుల రాంరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నేడు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ రాజ్యంలో రెండు లక్షల వ్యవసాయ రైతు రుణ మాఫీలు, గృహ జ్యోతి, మహాలక్ష్మి, ఉచితంగా ఆరు కిలోల చొప్పున సన్న రకం బియ్యం పేదవర్గాలకు పంపిణీ. ఇందిరమ్మ ఇళ్లు రానున్న రోజుల్లో మన మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రారంభం కానున్నాయని కమలాకర్ అన్నారు. అంతేకాకుండా దేశ స్వతంత్రం నుండి నేటి వరకు జరుగుతున్న రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం పెద్దలైన నరేంద్ర మోడీ అమిత్షాలు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకమైనటువంటి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. రాజ్యాంగాన్ని మార్చాలని సంకల్పంతో మనువాదులు బిజెపి పార్టీ ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్ మనువాదులు మహాత్మా గాంధీని చిన్నగా చేస్తూ మాట్లాడుతూ మహాత్మా గాంధీ వల్ల ఈ దేశానికి చాలా నష్టం జరిగిందని చెప్పి విద్యార్థులకు యువకులకు సమావేశాలు పెట్టి తప్పుదోవ పట్టిస్తున్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటీసీ ముల సునీతమురళీధర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ ఆవుల భిక్షపతి, డోర్నకల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శాగంటి సందీప్, సీనియర్ నాయకులు బిక్కు, గ్రామ నాయకులు సేవ్య, యూత్ మండల అధ్యక్షులు దాసరి రాజు ముదిరాజ్, మాజీ సర్పంచ్ గంగన్న, మేగ్య, వెంకటీయ్య, గ్రామ అధ్యక్షులు రమేష్, మురళీ, కిరణ్, యాకుబ్, ఎస్టీ నాయకులు వెంకన్న, దాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.





## బిఆర్ఎస్‌లోకి భారీగా చేరిన బాలానగర్ కాంగ్రెస్ కార్యకర్తలు..

**కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కృష్ణా రావు...**

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి



కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో బాలనగర్ డివిజన్ ఇందిరానగర్ కాలనీకి సంబంధించి కాంగ్రెస్ నాయకులు పుట్టపాగ మధు, బాలరాజు, కురుమయ్య సహా 50 మంది ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బి ఆర్ఎస్ నాయకుడు గిరి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పార్టీ కండువా కప్పి వారిని ఆహ్వానించారు .. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూకట్ పల్లి నియోజకవర్గాన్ని గత పది సంవత్సరాల్లో ఎంతో ఆదర్శంగా తీర్చిదిద్దారని ఇందిరానగర్ కాలనీ ఒకప్పుడు ఎలా ఉండిందో.. ఇప్పుడు ఎలా ఉందో కళ్ళ ముందు కనిపిస్తుందని దీనంతటికి కారణం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కృషి అని అన్నారు.. రోడ్లు, డ్రైనేజ్ విద్యుత్, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలకు నేడు ఎక్కడ ఇబ్బంది లేకుండా ఆయన ఆధ్వర్యంలోనే కాలనీ ని అభివృద్ధి చేశారని అంతేకాకుండా... అనేక సంక్షేమ కార్యక్రమాలతో ఆదుకున్నారని.. నేడు జరుగుతున్న కాంగ్రెస్ పరిపాలన తీరు చూసి ప్రజలు విసుగెత్తిపోయారని అందుకే అభివృద్ధికి పట్టం కట్టాలని ఉద్దేశంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో కేసీఆర్, నాయకత్వాన్ని బలపరచాలని నిర్ణయించుకున్నామని తెలిపారు.

## ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను పరిశీలన : కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి



124 ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ లో రూ. 2 కోట్ల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను, రూ. 1 కోటి రూపాయల అంచనావ్యయం తో చేపట్టబోయే చిల్డ్రన్ పార్క్ నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ శ్రీ దొడ్ల వెంకటేష్ గౌడ్, ఎఇ శ్రావణి తో కలిసి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్, మాట్లాడుతూ పీజేఆర్ నగర్ కాలనీలో నిర్మిస్తున్న మల్టి పర్పస్ ఫంక్షన్ హాల్, చైల్డ్రెన్స్ పార్క్ నిర్మాణ పనులలో భాగంగా ప్రహరీ గోడ, ఫంక్షన్ హాల్ బేస్మెంట్ నిర్మాణాలు పూర్తయ్యాయని అన్నారు. ఇప్పుడు బేస్మెంట్ కు పిల్లర్లు నిర్మిస్తున్నారని తెలియచేశారు. పీజేఆర్ నగర్ కాలనీ వాసుల చిరకాల కోరిక త్వరలోనే నెరవేరుతుంది అని, అందరికి ఆమోదయోగ్యమైన ఫంక్షన్ హాల్ ను అన్ని హంగుల తో సకల సౌకర్యాల తో నిర్మిస్తామని కార్పొరేటర్ తెలియచేసారు. ఫంక్షన్ హల్ పేద మధ్య తరగతి ప్రజలకు ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియచేసారు. ఫంక్షన్ హల్ లో వివాహాది శుభకార్యాలు, సమావేశాలు, సభలు, చిన్న చిన్న ఫంక్షన్ లు, జన్మదిన వేడుకలు, నిర్వహించుకునేందుకు వీలుగా ఫంక్షన్ హాల్ ఉపయోగపడుతుంది అని అన్నారు. ఫంక్షన్ హాల్, చిల్డ్రన్ పార్క్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలతో చేపట్టి ప్రజలకు త్వరలోనే అందుబాటులో కి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, శ్యాముల్, మహేష్, ఖలీమ్, సుధాకర్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు...

## న్యాయవాదుల పైన జరుగుతున్న దాడులను ఖండించిన న్యాయవాది నాగేంద్ర

**అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ వచ్చే విధంగా ప్రభుత్వం పైన వత్తిడి తేవాలి..న్యాయవాది నాగేంద్ర**

టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి



నాంపల్లి కోర్టు న్యాయవాది పైన జరిగినటువంటి దాడిని ఖండిస్తూ నేడు కూకట్ పల్లి న్యాయవాదులు విధులను బహిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాది నాగేంద్ర మాట్లాడుతూ రోజు రోజుకి న్యాయవాదుల పైన దాడులు ఎగిపోతున్నాయని, హైకోర్టు బార్ అసోసియేషన్, హైకోర్టు న్యాయవాదులందరూ పెద్దన్న పాత్ర పోషించాలని, ఇతర బార్ అసోసియేషన్, న్యాయవాదుల ఫెడరేషన్ అందరూ ముందుకు వచ్చి అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ వచ్చే విధంగా ప్రభుత్వం పైన వత్తిడి తీసుకురావాల్సిందిగా లేనిపక్షంలో న్యాయవాదులు అందరూ కలిసి అసెంబ్లీని ముట్టడించి న్యాయవాదుల యొక్క హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాట్లాడటం జరిగింది.

since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
మంగళవారం,
08-04-2025


# కబ్జాకు గురైన తన స్థలాన్ని తనకు ఇప్పించండి

### ప్రజావాణిలో బాధిత మహిళ వేడుకోలు



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

అధికారంలో ఉన్నామని ఇష్టానుసారం తన స్థలం హద్దురాళ్లను తొలగించి, తన భూమిని కబ్జా చేసి, గత రెండు సంవత్సరాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్న వారి నుండి తన స్థలాన్ని రక్షించి, తనకు తన స్థలాన్ని అందజేయాలని బాధిత మహిళ సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండల తహశీల్దార్ సతీష్ కుమార్, పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్, రామకృష్ణాపూర్ ఎస్ఐ జి రాజశేఖర్ లకు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా బాధితురాలు మంద పద్మ మాట్లాడుతూ, పట్టణంలోని ప్రాణహిత కాలనీకి చెందిన తాను గత మూడు సంవత్సరాల క్రితం మండలంలోని సారంగపెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని తుర్కపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 205లో మూడున్నర గంటల భూమిని ఆవుల రమేష్ అనే వ్యక్తి నుండి కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేసుకొని, స్థలం చుట్టూ సరిహద్దుకు రాళ్లు ఏర్పాటు చేసుకున్నానని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో చెట్ల తొలగింపు పనులను గ్రామ మాజీ సర్పంచ్ భర్త ఫిరోజ్ చేపట్టి, పిచ్చి మొక్కల తొలగించే నెపంతో తన భూమి సరిహద్దు రాళ్లను తొలిగించాడని, దీనిని అదునుగా భావించిన భూమి అమ్మిన ఆవుల రమేష్ తన హద్దులను దాటి, తన భూమిని కబ్జా చేశాడని వివరించారు. దీని గురించి మాజీ సర్పంచ్ భర్తను, ఆవుల రమేష్ ను అడిగినా వారి నుండి ఎలాంటి సరైన సమాధానం రాలేదని తెలిపారు. ఈవిషయమై గతంలో ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఎలాంటి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన భూమి వద్దనున్న పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమంలో తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, పిచ్చి మొక్కలను తొలగించే వంకతో స్థలం హద్దురాళ్లను తొలగించి, తనను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. గత మూడు సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తున్న ఆవుల రమేష్, గ్రామ మాజీ సర్పంచ్ భర్త ఫిరోజ్ పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా తన భూమి హద్దురాళ్లను నిర్ధారించి, తనకు తగిన న్యాయం చేయాలన్నారు. అదే విధంగా ఆవుల రమేష్ నుండి ఆవుల బక్కయ్య అనే వ్యక్తి అదే సర్వే నెంబర్లో భూమిని కొనుగోలు చేయగా, అతని సరిహద్దు దాటి, తన భూమి హద్దుల్లో ఫెన్సింగ్ వేశాడని అతని పైన సైతం చర్యలు చేపట్టి, తనకు న్యాయం చేయాలని కోరారు.

# ప్రజావాణికి 70 ఫిర్యాదులు



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ కలెక్టరేట్

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 70 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, మెప్మా పీ.డీ రాజేందర్, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ

# శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయంలో బతుకమ్మ వేదిక (షెడ్డు) ప్రారంభోత్సవం..

### పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు..

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి



కూకట్ పల్లి శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణం నందు నూతనంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ వేదిక (షెడ్డు) ప్రారంభోత్సవంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర రావు, శ్రీ దాసాంజనేయ స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న రాజేశ్వరరావు నీ ఆలయ అర్చకులు వేదఆశీర్వచనలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లీ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,ఎమ్మెల్సీ కురుమయ్యగారి నవీన్ రావు,కురుమయ్యగారి కొండలరావు, గొట్టుముక్కల వెంగళరావు, కురుమయ్యగారి నర్సింగ్ రావు ,రామాలయం చైర్మన్ తులసి రావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : జిల్లా కలెక్టర్ కుమార్

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-



ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారుల సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావుతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నస్పూర్ మండలం సీతారాంపల్లి గ్రామానికి చెందిన జాడి శ్రీనివాస్ తన తండ్రి పేరిట నస్పూర్ శివారులో భూమి ఉందని, ఆయన మరణించినందున అట్టి భూమిని తన తల్లి పేరిట విరాసత్ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం కామన్ పల్లి గ్రామానికి చెందిన నీల సత్తవ్వ తాను ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నానని, చిరునామాలో గ్రామం పేరు పొరపాటున కవ్వాల్ గా నమోదు అయిందని, ఈ తప్పును సవరించి తనకు రుణం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం నంనూర్ చెందిన మేకల గట్టయ్య తాను గత 50 సంవత్సరాలుగా తన సొంత భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నానని, ఇట్టి భూమికి తనకు పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. భీమిని మండలం అక్కలపల్లి గ్రామానికి చెందిన చాపిడి అర్జయ్య తనకు గల భూమిని తన నలుగురు కుమార్తెలకు రిజిస్ట్రేషన్ దస్తావేజుల ద్వారా దానంగా ఇచ్చానని, వారి వివరాలు ఆన్లైన్లో నమోదు చేసి వారికి పట్టా పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బహుజన్ ముక్తి పార్టీ ప్రతినిధి మొయ్యి వేణుగోపాల్ తన దరఖాస్తులో జిల్లాలోని మందమర్రి శివారులో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించుకున్నారని, ఈ విషయపై విచారించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరారు. మంచిర్యాల పట్టణం రాంనగర్ ప్రాంతానికి చెందిన ఇప్పల లచ్చయ్య తన భార్యకు వైద్య సేవల నిమిత్తం చెల్లించవలసిన నగదును ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు చెందిన పుల్లూరి సుధాకర్ తమ వార్డులో చేపట్టిన వరద నీటి కాలువ, మురుగ కాలువల నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం రేండ్లగూడ గ్రామానికి చెందిన మురిమడుగుల ఇమ్మాన్యుయేల్ తనకు గల భూమి నిషేధిత జాబితాలో నమోదు అయిందని, తొలగించి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. లక్షెట్టిపేట మండలం హన్మంతపల్లి గ్రామానికి చెందిన గుమ్ముల రాజేశ్వరి భర్త గల్ఫ్ దేశానికి ఉపాధి కోసం వెళ్ళి అకస్మాత్తుగా మృతి చెందాడని, జిఓ ప్రకారం పరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తెలంగాణ ఎరుకల ప్రజా సమితి ప్రతినిధులు తమ దరఖాస్తులో ఎరుకుల కులస్తులకు ఎస్సి, ఎస్టి మానిటరింగ్ కమిటీలో చోటు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ సీతారామచంద్రస్వామి పట్టాభిషేకం..

### కృష్ణారావు సతీమణి లక్ష్మీబాయితో కలిసి పాల్గొన్న కార్పొరేటర్ రోజా దేవి రంగారావు

టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి



కూకట్ పల్లి నియోజకవర్గం కూకట్‌పల్లి గ్రామంలో గల శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో కూకట్ పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సీతారామచంద్రస్వామి సామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమంలో శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు సతీమణి మాధవరం లక్ష్మీబాయి, చైర్మన్ తులసిరావు దంపతులు, స్థానిక భక్తులతో కలిసి పాల్గొన్న కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు

# ఓర్సు ఎంకటి కుటుంబానికి అండగా ఆటో కార్మిక సేవా సమితి

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-



పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీపతి నగర్ కు చెందిన ఓర్సు ఎంకటి కుటుంబానికి ఆటో కార్మిక సేవ సమితి అండగా నిలిచింది. సోమవారం ఎంకటి స్వగృహంలో సేవా సమితి చైర్మన్ నేరేళ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో ఎంకటి కుటుంబ సభ్యులకు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈసందర్భంగా సేవా సమితి చైర్మన్ నేరేళ్ల వెంకటేష్ మాట్లాడుతూ, గత 15 రోజుల క్రితం ఓర్సు ఎంకటి అకాల మరణం చెందటంతో వారి కుటుంబం జీవనం ఉపాధిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబాలకు ఆటో కార్మిక సేవా సమితి వెన్నంటి ఉంటూ, వారికి తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలు గుడికందుల ఓదెలు, సకినాల శంకర్, హరికృష్ణ, బుద్ధ తిరుపతి, పోతుగంటి తిరుపతి, నీరేటి శ్రీశైలం, బండారి రవి, గోసిక ప్రభాకర్, సంసాని దొరబాబు, సంసాని సత్యనారాయణ, బేర వేణుగోపాల్, గోపిక భానుచందర్, బరిడ సరూప లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి వైస్ చైర్మన్ గోవిందుల శంకర్, రెడ్డి సతీష్, కోశాధికారి గోశిక ప్రభాకర్, డైరెక్టర్లు సముద్రాల శ్రీనివాస్, దుర్గం రవి, నందిపాటి రవి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పిట్టల రవి, ఎలగందుల శ్రీనివాస్, సాట్టు నారాయణ లు పాల్గొన్నారు.

# జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదంతో పెద్ద ఎత్తున ఉద్యమిద్దాం

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

భారత రాజ్యాంగాన్ని, దేశ సమగ్రతను కాపాడుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదంతో పెద్ద ఎత్తున ఉద్యమిద్దమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బానోతు నీలయ్య పిలుపునిచ్చారు. సోమవారం చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు మండలంలోని శంకర్ పల్లి గ్రామ శివారులో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలనే విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిజెపి పాలనలో రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం హక్కులను కాలరాస్తూ, మహాత్మా గాంధీ చూపిన అహింస, శాంతి సిద్ధాంతాలను విస్మరిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్, సీనియర్ నాయకులు కడారి జీవన్ కుమార్, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు ఒడ్నాల కొమురయ్య, ఆసంపల్లి రాజయ్య, పెద్దపల్లి చంద్రకళ, సుంకరి నంబయ్య, తిరుపతిరెడ్డి, పెంచాల రాయలింగు, కొట్టే సంపత్ కుమార్, ఆకుల అంజి, సంతోష్, బచ్చలి రాములు, గుమాస మల్లేష్, శంకర్ లు పాల్గొన్నారు.



# కన్నుల పండుగగా శ్రీసీతారాముల కళోత్సవం

### ఆట పాటలతో అలరించిన కళాకారులు



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శిఖర ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని యాపల్ ప్రాంతంలోని కోదండ రామాలయం ఆవరణలో నిర్వహించిన శ్రీసీతారాముల కళోత్సవం - 2025 కార్యక్రమం ఆద్యంతం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. ముందుగా నటరాజ స్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. శిఖర ఆర్ట్స్ అధినేత, తెలంగాణ ధూంధాం వ్యవస్థాపకుడు అంతడుపుల నాగరాజు సారధ్యంలో జరిగిన కళోత్సవానికి ఉప్పులేటి నరేష్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ నేత సోత్కు సుదర్శన్ హాజరై, మాట్లాడుతూ, శ్రీరామ నవమిని పురస్కరించుకొని ప్రతి ఏటా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు.పట్టణంలో అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో రాణిస్తున్న, మట్టిలో మాణిక్యాలు లాంటి కళాకారులు ఉన్నారన్నారు. కళాకారులకు ప్రభుత్వ పరంగా సహాయం అందించేందుకు తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను శ్రీ రాముడి భక్తి గీతంతో ప్రముఖ గాయకుడు బాలు ప్రారంభించగా, కోల్ ఇండియా కళాకారుడు సాధనవేణి ప్రభాకర్ ఆర్కెస్ట్రా బృందం పాటలు, శ్రీ సాయి నాట్య కళానిలయం అశ్విని బృందం, ఆసం కళ్యాణ్ బృందం, ఏబిసిడి డాన్స్ అకాడమీ, యూట్యూబర్ సమీరా బృందం కళాకారులు పూసాల బృంద, బుక్యా హరిత, ప్రదర్శించిన జానపద నృత్యాలు, శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకులను అమితంగా అలరించాయి. జబర్దస్త్ ఫేమ్, ప్రముఖ మిమిక్రి కళాకారుడు గౌరేష్ చేసిన మిమిక్రీ ప్రేక్షకులను అలరించింది. అనంతరం కళాకారులను, నిర్వాహకులను, కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కన్వీనర్ నెరువట్ల రాజలింగు, బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు సకినాల శంకర్, పట్టణ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గాండ్ల సంజీవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మంద తిరుమల్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు రాయబారపు కిరణ్, కోదండ రామాలయం ఆలయ కమిటి గౌరవ అధ్యక్షుడు బొద్దిరెడ్డి వెంకట్ రెడ్డి, అధ్యక్షుడు సంగార్తి సంతోష్, సీనియర్ కళాకారులు రాకం సంతోష్, కొండపర్తి సది, ఎర్రవేణి రమేష్ , అంతరుపుల మధు లు పాల్గొన్నారు.

# ఘనంగా వివేకవర్ధిని కళాశాల వీడ్కోలు

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-



పట్టణంలోని సాయిమిత్ర గార్డెన్ లో సోమవారం జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణానికి చెందిన వివేకవర్ధిని డిగ్రీ, పీజీ కళాశాల వీడ్కోలు కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని, ఆటపాటలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో వీక్షకులను అలరించారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఉదారి చంద్రమోహన్ గౌడ్ మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎప్పటికప్పుడు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. నిరంతర కృషి, క్రమశిక్షణతోనే విజయం సాధించవచ్చునని, ఓర్పు అంకితభావంతో కష్టపడి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలన్నారు. కోల్ బెల్ట్, పారిశ్రామిక ప్రాంతమైన మంచిర్యాల జిల్లాలో వివేకవర్ధిని పీజీ, డిగ్రీ కళాశాలలో అత్యుత్తమమైన విద్యతోపాటు విద్యార్థికి ఉద్యోగ సాధనకు అవసరమైన నైపుణ్యాన్ని, అత్యుత్తమైన ఉపాధ్యాయులచే అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఈ సమావేశంలో హుషారెత్తించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు సతీష్, రాజేష్, శారీన, శ్రీలేఖ, సమీర్, చైతన్య, రాజేష్ వంశీ, చిరంజీవి, పవిత్ర, నేహా , కీర్తన , తాజ్ బాబా కళాశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు ఉద్యోగాల భర్తీ కొరకు ఎన్రోల్మెంట్ డ్రైవ్

### జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్కామ్), తెలంగాణ ప్రభుత్వంలోని కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ క్రింద రిజిస్టర్డ్ రిక్రూట్మెంట్ ఏజెన్సీ ద్వారా అర్హత, నైపుణ్యం కలిగిన, సెమీ స్కిల్డ్ కార్మికులకు విదేశాలలో ఉద్యోగాల భర్తీ కొరకు మంగళవారం జిల్లాలోని జన్నారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ సోమవారం ప్రకటనలో తెలిపారు. సిరామిక్ కాస్టర్, జూనియర్ ప్రాసెస్ ఆపరేటర్, ప్రెస్ మెకానిక్, పాలిషింగ్ మెకానిక్, డిజైనర్, ప్రొడక్షన్ సూపర్వైజర్, బాడీ ప్రిపరేషన్ ఇన్చార్జ్, ఫోర్క్లి ఆపరేటర్, షావెల్ ఆపరేటర్ లకు యుఏఈ లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు 18 నుండి 40 సంవత్సరాల మధ్య వయస్సుతో పాటు అర్హతలు కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ నవీకరించబడిన రెస్యూమ్ ను tomcom.resume@gmail.com కి పంపాలని, వివరాల కోసం www.tomcom.telangana.gov.in, వెబ్ సైట్‌లో 9440049937, 9440049861, 9440051452 నెంబర్ లలో సంప్రదించవచ్చునన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
మంగళవారం,
08-04-2025
4

# వరిధాన్యం కొనుగోలు కొరకు ముందస్తు ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-



ప్రభుత్వ ఆదేశాల మేరకు వరిధాన్యం కొనుగోలు కొరకు రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి జిల్లా గ్రామీణాభివృద్ధి, పౌర సరఫరాలు, వ్యవసాయ, సహకార, రవాణా, మార్కెటింగ్ శాఖల అధికారులు, మెప్మా అధికారులతో కలిసి యాసంగి 2024-25 వరిధాన్యం కొనుగోలుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల మేరకు రైతుల వద్ద నుండి నాణ్యమైన వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. యాసంగి 2024-25 సంవత్సరానికి గాను గ్రేడ్ ఎ రకానికి 2 వేల 320 రూపాయలు, సాధారణ రకానికి 2 వేల 300 రూపాయలు మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని తెలిపారు. వేసవి అయినందున నీడ, త్రాగునీరు ఇతర సౌకర్యాలు కల్పించడంతో పాటు ఓఆర్ఎస్, మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. తూకము చేయడానికి వినియోగించే కాంటా, బాట్లు, తేమ శాతాన్ని పరిశీలించే మాయిశ్చర్ మీటర్, ప్యాడీ క్లీనర్లు, డిజిటల్ మైక్రో మీటర్, గన్నీ సంచులు సమకూర్చుకోవాలని, అకాల వర్షాల నుండి ధాన్యాన్ని రక్షించుకోవడానికి అవసరమైన టార్పాలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో కనీసం 25 టార్పాలిన్లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ధాన్యం తూకం చేయడానికి ముందే సంబంధిత రైతు వద్ద నుండి కూపన్, బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం నకలు ప్రతులను తీసుకోవాలని, ఇట్టి వివరాలను ట్యాబ్లో నమోదు చేసి ధాన్యం కొనుగోలు చేసి రశీదు జారీ చేయాలని తెలిపారు. సన్నరకం, దొడ్డురకం ధాన్యాన్ని వేర్వేరుగా కొనుగోలు చేయడం జరుగుతుందని, కొనుగోలు వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్ లో నమోదు చేయాలని తెలిపారు. తూనికలు, కొలతల శాఖ ద్వారా పరీక్షించబడి ధృవీకరించబడిన తూకం యంత్రాలను మాత్రమే కొనుగోలు ప్రక్రియలో వినియోగించాలని, కొనుగోలు కేంద్రాలలో మాన్యువల్ తూకం జరుగకుండా డిజిటల్ తూకం యంత్రాల ద్వారా కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఐకెపి ఆధ్వర్యంలో 104 దొడ్డురకం, 90 సన్నరకం కొనుగోలు కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 80 దొడ్డురకం, 39 సన్నరకం, మెప్మా ఆధ్వర్యంలో 4 దొడ్డురకం, 2 సన్నరకం కొనుగోలు కేంద్రాలతో మొత్తం 319 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని తెలిపారు. బ్యాంక్ గ్యారంటీ ఇచ్చిన వారికి, సిఎంఆర్ డెలివరీ సకాలంలో చేసిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం కేటాయింపు జరుగుతుందని తెలిపారు. గన్నీ సంచుల నిర్వహణ పక్కదారి పట్టకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య సభ్యులు, ఎపిఎంలు, సిసిలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శులు, పర్యవేక్షక అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్యకరమైన ఆరంభాలు ఆశాజనక భవితవ్యాలు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-




ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్యకరమైన ఆరంభాలు ఆశాజనక భవితవ్యాలు అనే నినాదంతో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కార్యక్రమ గోడప్రతులను జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, ముఖ్య ప్రణాళిక అధికారి జి సత్యం, ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 1948 ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏర్పాటు చేయబడినందున ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా పునరుత్పత్తి శాతం తగ్గుతుందని, ఈ పరిస్థితి ఆందోళన స్థాయిలో ఉన్నందున మాతా శిశు సంరక్షణ అత్యంత ముఖ్యమైన అంశంగా తీసుకొని ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. తల్లి, బిడ్డ లను ఒకే యూనిట్గా తీసుకొని సేవలు అందించాలని, దేశ సుస్థిర, సుసంపన్న భవిష్యత్తు నిర్మాణానికి, మానవ జాతి మనుగడకు తల్లి, బిడ్డలు అత్యవసరమని, మాతృ, నవజాత శిశువులు, 5 సంవత్సరాల లోపు పిల్లల మరణాలను తగ్గించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మాతా శిశు మరణాలను నివారించేందుకు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను బలోపేతం చేయడం, ఆరోగ్య కార్యకర్తలకు, వైద్యులకు శిక్షణ అందించడం, అందుబాటులో ఆరోగ్య కేంద్రాలు, నాణ్యమైన ప్రసవ పూర్వ సేవలు, గర్భిణీగా ఉన్నప్పుడు 16-22 వారాల మధ్య టిఫా స్కాన్ చేయడం ద్వారా గర్భస్థ పిండం పెరుగుదల, సమస్యలను ముందుగా గుర్తించవచ్చని, జిల్లాలో అల్ట్రాసౌండ్, రక్త, మూత్ర పరీక్షలు, రక్తపోటు, రక్తంలో చక్కర శాతం, హెచ్ బి, ఎజి, హెచ్ఐవి పరీక్షలు చేయడం జరుగుతుందని తెలిపారు. మాతా శిశు సంరక్షణలో దేశంలో తెలంగాణ, రాష్ట్రంలో మంచిర్యాల ముందు స్థానంలో ఉందని, జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా చేపట్టిన ఆరోగ్య కార్యక్రమాలలో తల్లి, బిడ్డ ఆరోగ్యంలో ఎంతో మార్పు వచ్చిందని, ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్, జనని శిశు సంరక్షణ, జనని సురక్ష యోజన, ఆరోగ్యలక్ష్మి, రాష్ట్రీయ బాల స్వాస్త, సురక్షిత మాతృత్వం కార్యక్రమాల ద్వారా సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడం, సిజేరియన్లను తగ్గించడం, నవజాత శిశు సంరక్షణ కోసం ప్రత్యేక ఎస్ ఎన్ సి యు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడం, గర్భవతులను గుర్తించి ప్రత్యేక వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రజలందరు ప్రభుత్వ ఆసుపత్రులలో, ఆశ, ఆరోగ్య కార్యకర్తల ద్వారా వైద్య సేవలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు అనిత, ప్రసాద్, కృపాబాయి, సీతారామరాజు, మాస్మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యంపై రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం

**బిజెపి నాయకులు రఘునాథ్ వెరబెల్లి**

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-




కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందించే రేషన్ బియ్యం పై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం నిర్వహిస్తుందని బిజెపి నాయకులు రఘునాథ్ వెరబెల్లి తెలిపారు. బిజెపి పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 6 నుండి 13 వరకు నిర్వహించే స్థాపన దివాస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన మంచిర్యాల పట్టణం గర్మిళ్లలో నూతనంగా నిర్మించిన బిజెపి పార్టీ జెండా గద్దెను ఆవిష్కరించి, అనంతరం బిజెపి పార్టీ పథకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను కలిసే కార్యక్రమంలో భాగంగా గర్మిళ్లలోని రేషన్ షాపులను సందర్శించి, లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాలుగా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉచితంగా పేద ప్రజలకు రేషన్ బియ్యం అందిస్తుందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పేరుతో తామే బియ్యాన్ని అందిస్తున్నామని ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం చేసే దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, మరొక ఐదు సంవత్సరాలు సైతం ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా రేషన్ బియ్యం అందిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒక కిలో బియ్యం తమ వాటా కింద ఇచ్చి, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, రేషన్ షాపుల దగ్గర కాంగ్రెస్ పార్టీల ఫ్లెక్సీలు పెట్టి, తామే ఉచిత బియ్యం అందిస్తున్నట్టు గొప్పలు చెప్పుకుంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం చేసే తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రేషన్ షాప్ లో వద్ద రాష్ట్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ ఫోటో పెట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రేషన్ షాపుల వద్ద నెలకొన్న సమస్యలపై మంచిర్యాల మండల తహశీల్దార్ కు ఫోన్ ద్వారా తెలియజేసి, రేషన్ షాపు కోసం వస్తున్న ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, ఆకుల అశోక్ వర్ధన్, అమిరిశెట్టి రాజ్ కుమార్, కంకణాల సతీష్, జోగుల శ్రీదేవి, కాశెట్టి నాగేశ్వర్ రావు, శివశంకర్, సుదర్శన్ లు పాల్గొన్నారు.

# అంధకారంలో ఏరియా భవిష్యత్తు

- మందమర్రి ఏరియా కనుమరుగు అయ్యేనా...?
- నూతన గనులు లేకపోతే బతికేది ఎట్లా...?
- హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల వైఫల్యం వలన సింగరేణికి 11 సంవత్సరాలు నుండి నూతన గనులు రాలేదని, పాత గనులను కావాలనే మూసివేయడం ఆగలేదని, దీంతో ముఖ్యంగా ఏరియా అంధకారంలో మునిగి, భవిష్యత్తు చీకటిమయం అవ్వబోతుందని సింగరేణి మైనింగ్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ (హెచ్ఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని యూనియన్ కార్యాలయం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏరియాలోని కేకే 1, ఆర్కే 1ఏ గనులను కావాలని మూసివేయడం దారుణమన్నారు. షాఫ్ట్ ద్వారా ఇంకా 20 ఏండ్లు నడవాల్సిన గనులను లాభాలు రావట్లేదని, కార్మికుల నోటికాడ బుక్క లాక్కుంటూ, ఏరియాని చీకటిమయంగా మార్చడం ఘోరాతి ఘోరమని తెలిపారు. ఆర్కే ఓసిపి మూసివేయడం అధికారుల ప్రణాలిక లోపమే కారణమని ఆరోపించారు. కేకే 5 గనిని సైతం అతి త్వరలో మందమర్రిని బుగ్గి పాలు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 10ఏండ్ల కింద ముగ్గు పోసి, ప్రజాభిప్రాయ సేకరణ అయ్యాక, భూములను కొన్న తర్వాత కూడా కేకే 6 గనిని తెరవకపోవడం గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల చేతకానితనమేనని విమర్శించారు. రాజకీయ జోక్యం వలన 40 వేల కోట్ల బకాయిలు సింగరేణికి రావట్లేదన్నారు.




జనం రెండింతలు పెరిగితే కార్మికులు రెండింతలు అవుతారనుకుంటే సగం కంటే తక్కువగా దిగజారిన బతుకులైనాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వాలకు సింగరేణి సంస్థ జేబు సంస్థగా మారిందని విమర్శించారు. ప్రభుత్వానికి, యాజమాన్యానికి ఉత్పత్తి, లాభాలు తప్ప కార్మికుల సంక్షేమం, ఉపాధి పట్టావా అని ప్రశ్నించారు. ప్రభుత్వంతో వేలానికి సై అంటూ, గనుల వద్ద నై అంటూ కార్మికులను మోసం చేస్తున్న గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. యువ కార్మికులు చైతన్యవంతులై, డబ్బులు పంచి గెలిచే సంఘాలను ప్రతిఘటించకుంటే సింగరేణి మాయమయ్యే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. అదేవిధంగా సింగరేణి పరిరక్షణకు నడుం బిగించి, ఉద్యమాలకు, సమ్మెలకు సిద్ధం కావాలని యువ కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు జే శ్రీనివాస్, కేంద్ర కమిటీ నాయకులు వెల్ది సుదర్శన్, నాయకులు ఎర్ర శ్రీనివాస్ రెడ్డి, చొప్పరి రామస్వామి, బోనాల శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

## కొర్రమీను సాగు కొరకు దరఖాస్తుల స్వీకరణ

**జిల్లా మత్స్యశాఖ అధికారి వై సాంబశివరావు**

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

మత్స్య పరిశ్రమలో పని చేస్తున్న ఔత్సాహికులు, మత్స్యకారులు, మత్స్య రైతులు, హెూల్సేల్, రిటైల్ చేపల విక్రయదారులు, చేప పిల్లలు ఉత్పత్తి చేయువారిలో ఆసక్తి గల వారి నుండి కొర్రమీను సాగును చేసేందుకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా మత్స్యశాఖ అధికారి వై సాంబశివరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాను ముర్రెల్ క్లస్టర్గా ఏర్పాటు చేసేందుకు గుర్తించడం జరిగిందని, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా సాధారణ (జనరల్) క్యాటగిరీ-40 శాతం, ఎస్సి, ఎస్టి, మహిళ క్యాటగిరీ-60 శాతం రాయితీపై 3 హచరి యూనిట్లు, 10 హెక్టార్లు చేపల పెంపకం చెరువులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తులు మత్స్యశాఖ కార్యాలయంలో స్వీకరించడం జరుగుతుందని, వివరాలకు జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎఫ్-8లో గల జిల్లా మత్స్య శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## అంగన్వాడి సిబ్బందికి కనీస వేతనం అమలు చేయాలి




టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీ టీచర్లకు ఆయాలకు కనీస వేతనం 18వేల రూపాయలు అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ కరుణ కుమారి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఏఐటియుసి యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నాలుగు సెంటర్లకు చెందిన సుమారు వందమంది అంగన్వాడీ టీచర్లు, ఆయాలు ఏఐటీయూసి(అంగన్వాడీ)యూనియన్ లో చేరారు. వీరికి ఏఐటియుసి (అంగన్వాడీ) యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ కరుణకుమారి యూనియన్ కండువాలు కప్పి, సాదరంగా యూనియన్ లోకి ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, అంగన్వాడి కేంద్రాలకు పాఠశాలలకు సమానంగా ఒక పూట బడి, వేసవి సెలవులు అమలు చేయాలన్నారు. జూలై, 2024లో అంగన్వాడి టీచర్లు, ఆయాలను రిటైర్డ్ చేశారని, ఇంతవరకు వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదన్నారు. తక్షణమే టీచర్ లకు రెండు లక్షల రూపాయలు, ఆయాలకు లక్ష రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేస్తూ జీవో విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ. అదే విధంగా విధుల్లో ఉండి చనిపోయిన వారికి సైతం రిటైర్మెంట్ అయిన వారితో సమానంగా బెనిఫిట్స్ అందజేయాలన్నారు. 20 సంవత్సరాల కిందట ఇచ్చిన గ్యాస్ పొయ్యిలు, కుక్కర్లు, వంటసామాగ్రి పాడైపోయాయని ,అంగన్వాడి సిబ్బంది వాటిని తమ సొంత ఖర్చుతో రిపేరు చేసుకున్నారని, వెంటనే అంగన్వాడి సిబ్బందికి నూతన గ్యాస్ పొయ్యిలు, కుక్కర్లు, వంట సామాగ్రి అందజేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి టీచర్లు, ఆయాల పై జరుగుతున్న పై అధికారుల పెత్తనంపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కలీందర్, ఏఐటియుసి అంగన్వాడీ జిల్లా కార్యదర్శి తోకల సరస్వతి, సిపిఐ పట్టణ కార్యదర్శి కామెర దుర్గారాజ్ లు పాల్గొన్నారు.

## అందరి భవిష్యత్తు కోసం జై బాపు, జై భీమ్, జై సంవిదాన్..

**టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి




ఏఐసీసీ, తెలంగాణ కాంగ్రెస్ ఆదేశాల మేరకు " జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ " అభియాన్ కార్యక్రమాన్ని కూకట్ పల్లి నియోజవర్గ ఇంచార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశానికి హాజరైన కోఆర్డినేటర్ ఉజ్మా షాకీర్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, డివిజన్ అధ్యక్షులు, మహిళా బ్లాక్ అధ్యక్షురాళ్లు, డివిజన్ అధ్యక్షరాళ్లు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యూఐ, మహిళ కాంగ్రెస్, అనుబంధ సంఘల ప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నేతలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో ఉచిత అంబలి పంపిణీని ప్రారంభించిన కలెక్టర్

టైమ్స్ అఫ్ వార్త - నిజామాబాద్ కలెక్టరేట్

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీఓ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో నెలకొల్పిన ఉచిత అంబలి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం లాంచనంగా ప్రారంభించారు. చల్లని తాగునీటితో పాటు ఉచితంగా అంబలి పంపిణీకి చొరవ చూపడం అభినందనీయమని టీఎన్జీఓ సంఘాన్ని అభినందించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయం అని అన్నారు. కలెక్టరేట్ ఉద్యోగులతో పాటు వివిధ పనుల కోసం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయానికి వచ్చే వారికి ప్రస్తుత వేసవిలో అంబలి కేంద్రం ఎంతో ఉపశమనాన్ని అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్, కార్యదర్శి శేఖర్, రాష్ట్ర నాయకుడు గైని గంగారాం తదితరులు పాల్గొన్నారు.



since 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com



# అంతర్జాతీయ స్థాయిలో రోటరీ క్లబ్ సేవా దృక్పథంతో పనిచేస్తుంది

### రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ అధ్యక్షుడు బీరెల్లి విజయ రావు

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ



రోటరీ క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో సేవా దృక్పథంతో ముందుకెళ్తుందని రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ అధ్యక్షుడు బీరెల్లి విజయ రావు అన్నారు. సుమారు మూడున్నర లక్షల నిధులతో గుత్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో బాలికల నూతన శోచాల యాల ప్రారంభోత్సవ కార్యక్రమం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుత్పలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన బాలికల శోచాలయాలు, హ్యాండ్ వాష్ స్టేషనుల ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ రోటరీ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ వేద్ ప్రకాష్ మిట్టల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో పోలియో టీకాను ప్రవేశపెట్టి పోలియో నిర్మూలన కోసం ప్రపంచ దేశాల్లోనే పనిచేస్తుందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ విద్యను పటిష్టం చేయడంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని మౌలిక వసతులను కల్పించడంతోపాటు విద్యార్థులు అన్ని సౌకర్యాల మధ్య విద్యను అభ్యసించే దిశగా సేవలు అందిస్తుందన్నారు. ఇందులో భాగంగానే రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్, నిజామాబాద్ రోటరీ సర్వీస్ ట్రస్ట్, గుత్ప గ్రామ సేవా కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నూతనంగా అత్యాధునిక హంగులతో నిర్మించిన బాలికల షోచాలయాలు, హ్యాండ్ వాష్ స్టేషన్లను ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినదని, ఈ కార్యక్రమానికి అతిథిగా నిజామాబాద్ రోటరీ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ వేద్ ప్రకాష్ మిట్టల్, ప్రత్యేక అతిథిలుగా ఆలూరు మండల ఎంపీడీవో గంగాధర్, ఆలూరు ఎంఈఓ నరేందర్, మాక్లూర్ ఎంఈఓ సత్యనారాయణ హాజరై ఘనంగా అత్యాధునిక హంగులతో నిర్మించిన బాలికల శోచాలయాలను ప్రారంభించారు. ముందుగా వేద్ ప్రకాష్ మిట్టల్ శిలాఫలకం ఆవిష్కరింపజేసి అనంతరం షోచాలాయ భవనాలను ఆవిష్కరించారు. తదనంతరం అందరూ కలిసి పర్యావరణ పరిరక్షణలో భాగంగా నూతన అధ్యయనంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా అతిథులుగా హాజరైన వారందరూ కలిసి మాట్లాడుతూ దాదాపు 3.5 లక్షలకు పైగా వెచ్చించిన నూతన షోచాలాయ నిర్మాణాము జిల్లాలోనే అత్యాధునిక హంగులతో ఏర్పాటు చేసినదిగా గుర్తించామని, దీనికి రోటరీ క్లబ్ వారికి అభినందనలు తెలిపారు. అందరూ కలిసి బాలికల భవిష్యత్తుకై నూతన అధ్యయానంగా షోచాలయ నిర్మాణాలు విద్యార్థినిలకు అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ కార్యదర్శి రేకులపల్లి గంగారెడ్డి కృషి ఫలితమే ఈ నిర్మాణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పి. శ్రీనివాసరావు, భరత్ పటేల్, జ్ఞాన ప్రకాష్, బాబురావు, పార్సి రాజేశ్వర్, నర్సింగ్ రావు, డీఈఓ ప్రతినిధులు శ్రీధర్ రెడ్డి, ఆర్గనైజర్ ఓడ్డేన్న, అనిల్, గ్రామ కమిటీ సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, హెచ్ఎం దృపతి కుమార్, సిబ్బంది విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం..

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి




ప్రపంచ ఆరోగ్యసంస్థ(డబ్ల్యూహెచ్ఓ) వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా ఏప్రిల్7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా నిర్వహిస్తారు.ఈ సందర్భంగా ఎడపల్లి మండలం లోని నెహ్రూనగర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉర్దూ మీడియం పాఠశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు.మంచి ఆహార అలవాట్లపై విద్యార్థులతో నాటక ప్రదర్శన చేశారు.ప్రజల్లో ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించడం,మంచి ఆహార అలవాట్లు,పరిశుభ్రత పాటించేలా చైతన్యపరచడం తమ ముఖ్య ఉద్దేశమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.ఏయే ఆహార పదార్థాలు భుజిస్తే ఎలాంటి పోషకాలు, విటమిన్లు శరీరానికి మేలు చేస్తాయో,దరి చేరుతాయో తెలిపారు.అనంతరం కార్యక్రమంలో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమోంటలను, బహుమతులను పాఠశాల ఉపాధ్యాయులు బహూకరించారు.

# వైభవోపేతంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం...



టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి



నిజామాబాదు జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలో గల సనాతన శ్రీరామ మఠంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం మఠం వంశజులు ఘనంగా నిర్వహించారు.ఎడపల్లి మండల కేంద్రంలో 370 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన శ్రీ రామ మఠంలో శ్రీరామ జన్మోత్సవం వేడుకలను ఆదివారం కన్నులపండువగా ఘనంగా నిర్వహించగా,సోమవారం శ్రీ సీతారాముల కల్యాణ,పట్టాభిషేకం మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈమేరకు వేడుకల్లో పాల్గొన్న మఠం వంశజులు ప్రత్యేక పూజలు చేసి శ్రీ సీతారాముని ప్రతిమలను ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపంలో కల్యాణ మహోత్సవం నిర్వహించారు.అనంతరం డోలు, సన్నాయి మేళ,తాళలతో మండల కేంద్రం శివారులోగల గోవిందుపూర్ హనుమాన్ మందిరానికి వెళ్లి ప్రత్యేక పూజలతో పాటు భజన కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో శోభయాత్ర నిర్వహించారు.అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సురేష్ ఆత్మారామ్,అన్న జయరాం మాహారాజ్ లు మాట్లాడుతూ... సనాతనంగా వస్తున్న ఆచారం ప్రకారం శ్రీ రామ మఠంలో నవమి రోజున శ్రీ రాముని జన్మోత్సవాలు జరుపుకొని దశమి (సోమవారం ) నాడు శ్రీ సీతారాముల కళ్యాణం, సాయంత్రం పట్టాభిషేకం నిర్వహించడం జరిగిందన్నారు. శ్రీరామ మఠంలో నిర్వహించే శ్రీరామ జన్మోత్సవం అనంతరం సంతానం లేని దంపతులు బాలరాముని వొళ్ళోకి తీసుకుంటే సంతాన ప్రాప్తి తోపాటు స్వామివారి అనుగ్రహం కలుగుతుందన్నారు. పలువురు భక్తులు, పలు ఆలయాల నిర్వాహకులు శ్రీ సీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పి వైస్ చైర్మన్ రజిత యాదవ్,మఠం పీఠాధిపతి జయరామ్ మహారాజ్ కాశీ నుండి వచ్చిన కృష్ణ పురానిక్ మహారాజ్, మాజీ సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్,అత్మేలా శ్రీనివాస్, నాయిడి శంకర్, బంజ కామప్ప,ఎల్లయ్య యాదవ్, శ్రీరాం,మచ్కూరి గంగాధర్,నటరాజ్ గౌడ్, మల్లెపూల శ్రీనివాస్,ఎంపీటీసీలు,పలువురు ప్రజాప్రతినిధులు,వేడుకలను తిలకించేందుకు పలు గ్రామాల నుండి ప్రజలు తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు.

## కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ ప్రారంభోత్సవం

టైమ్స్ ఆఫ్ వార్త - గాంధారి





తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ,హైదరాబాద్ డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ కామారెడ్డి సహకారంతో గాంధారి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం రోజు కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ ను గాంధారి ఎస్సై ఆంజనేయులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహసీల్దార్ రేణుకచవన్, ఎంపీడీవో రాజేశ్వర్, పంచాయత్ సెక్రెటరీ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ఏలాంటి సివిల్ కేసులో ఉన్న పరిష్కరిస్తామని తెలిపారు. కమ్యూనిటీ మీడియేషన్ మెంబర్స్ వద్ద ప్రకాష్-9441202783, జాదవ్ కళ్యాణ్-9533311558, గోనె విష్ణు -9848986790, ఎన్. గణేష్ - 9440890520 సంప్రదించగలరు.

## మేడిపల్లి అటవీ ప్రాంతంలో మహిళా హత్య

టైమ్స్ ఆఫ్ వార్త - గాంధారి



గాంధారి మండలం మేడిపల్లి గ్రామం చందానగర్ తాండకి చెందిన కేతావత్ పిరాజి గత కొన్ని సంవత్సరాలనుండి హైదరాబాదు లోనే ఉంటూ బేగంపేట్ లో భిక్షాటన చేస్తూ బతుకుతూ ఉండేవాడు. అలాగే అదే బేగం పేట లో అమీనా బేగం అనే మహిళ భిక్షాటన చేస్తూ జీవించేది. పిరాజీ యొక్క కొడుకు అయిన శ్రీకాంత్ నాలుగు సంవత్సరాల గారిని అమీనా బేగం ఎత్తుకుపోయిందానే అనుమానంతో హైదరాబాద్ నుంచి ఆమెను తీసుకొని వచ్చి గాంధారి మండలం మేడిపల్లి గ్రామ శివారులో గల అడవి ప్రాంతంలో నా కొడుకు ఎక్కడ ఉన్నాడు చెప్పు అని విపరీతంగా కట్టలతో కొట్టడం వల్ల కుడిచే విరిగిపోయి తీవ్రంగా రక్తస్రావం కాగా గాంధారి ప్రభుత్వ ఆసుపత్రికి 108 లో తీసుకొని వచ్చి చికిత్స పొందుతుండగా చనిపోయింది. మేడిపల్లి మాజీ సర్పంచ్ నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా సదాశివ నగర్ సిఐ సంతోష్ కుమార్ గారు వచ్చి విచారణ ప్రారంభించారు.

## శ్రీ భక్త ఆంజనేయ సహిత త్రిమూర్తి శివ పంచాయతన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం



టైమ్స్ ఆఫ్ వార్త - గాంధారి

గాంధారి మండలంలోని వంద్రికల్ తండాలో సోమవారం రోజు శ్రీ భక్త ఆంజనేయ సహిత త్రిమూర్తి శివ పంచయాతన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవము ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సరిచంద్ మహారాజ్, చేద్మల్ తండా నాయకులు ప్రేమ్ సింగ్ నాయక్, అమర్ సింగ్ నాయక్, పెంటయ్య నాయక్,లాభానా జాతీయ అధ్యక్షులు తన్ సింగ్ పాల్గొన్నారు. భూమి దాత విజయమ్మ, విగ్రహ దాత స్వామీజీ శంకర్ రాజ్ ముఖ్య (హైదరాబాద్) పాల్గొన్నారు. వివిధ తండాల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు, అన్న దానం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గండిపేట్ ప్రవీణ్ పంతులు, బస్సీ నారాయణ, బస్సి దేవి సింగ్, బస్సి రతిరాం, గ్రామస్తులు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## నేడు భవానిపేటలో కుస్తీ పోటీలు

టైమ్స్ ఆఫ్ వార్త - గాంధారి

లింగంపేట్ మండలంలోని భవానిపేట గ్రామంలో నేడు కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామపంచాయతీ సెక్రెటరీ స్రవంతి తెలిపారు. శ్రీ రామ నవమి సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని మల్ల యోధులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. 5 తులాల వెండి కడియం బహుమతిగా అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే మల్లయోధులకు రక్షణ, భోజన సదుపాయం ఉంటుందని తెలిపారు.

## కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను ప్రారంభించిన టీ.ఎస్.పి భార్గవి

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్స్వాడ పట్టణంలో కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను టిఎస్పి భార్గవి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో వ్యక్తుల మధ్య ఆస్తుల మధ్య గొడవ జరిగినప్పుడు కమ్యూనిటీ మెడిసిన్ సెంటర్ వస్తే,మీసమస్యనువరిష్కరించుకోవచ్చని, అనవసరంగా పోలీస్ స్టేషన్లు,కోర్టులు చుట్టూ తిరిగి మీ సమయాన్ని వృధా చేసుకోవద్దని, ఇక్కడ న్యాయ సేవలు ఉచితంగా అందజేయబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, మున్సిపల్ కమిషనర్, సి.ఐ. అశోక్ కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్లు అయ్యాల సంతోష్, పుష్పవతి, రామకృష్ణారెడ్డి, అహ్మద్ హుస్సేన్,తదితరులు. పాల్గొన్నారు.

## రాజీ మార్గం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలి

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ

రాజీ మార్గం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని, సులభంగా తక్కువ ఖర్చుతో న్యాయ సేవలు అందించడమే లక్ష్యమని బాన్సువాడ మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి భార్గవి అన్నారు. సోమవారం బాన్సువాడ మున్సిపాలిటీ కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి, కోర్టు బయటే రాజీమార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడానికి కమిటీ సభ్యులు సహకరిస్తారన్నారు. ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగ పడుతుందని, ప్రజలకు మెరుగైన న్యాయ సేవలు అందించడంతో పాటు, కోర్టులపై భారాన్ని కూడా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, సీఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## పబ్లిక్ హెల్త్ నర్సు ఉద్యోగి పదవి విరమణ

టైమ్స్ ఆఫ్ వార్త - పిట్లం



పిట్లం మండల సామాజిక ఆరోగ్య కేంద్రంలో పబ్లిక్ హెల్త్ నర్సుగా 37 సంవత్సరాలు విధులు నిర్వహించినటువంటి శ్రీమతి శ్రీ అన్వరీ బేగం వారు పిట్లం ఆరోగ్య కేంద్రంలో 2018 నుండి పబ్లిక్ హెల్త్ నర్స్ గా వారి సేవలు అందించడం జరిగింది గతం మార్చి 31 వ తారీఖున వారు పదవీ విరమణ చేయడం జరిగింది వారి సర్వీస్ లో ఆరోగ్య సేవలు పిట్లం మండల కేంద్రంలో ఇవ్వడం జరిగింది. ఆశా నోడల్ ఆఫీసర్ గా తను సేవలు అందించడం జరిగింది. ఈ విషయంలో వారికి పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేస్తూ పిట్లం వైద్యాధికారి డాక్టర్ రోహిత్ కుమార్ ఆరోగ్య సిబ్బంది అందరూ వారికి విరమణ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ ఈవో భూమయ్య హెడ్ నర్స్ శైలజ సూపర్వైజర్ శాంతి శ్రీ సిబ్బంది విజయ్ కుమార్ మరియు ఆశాలు పాల్గొనడం జరిగింది.

## ప్రెస్ క్లబ్‌కు కుర్చీల విరాళం

### అందించిన బిజెపి నాయకుడు ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ నియోజకవర్గం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో సోమవారం బిజెపి నాయకులు ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ ఆర్థిక సహకారంతో మండల అధ్యక్షులు సున్నం సాయిలు ఆధ్వర్యంలో పాత్రికేయ మిత్రులకు ప్రెస్ క్లబ్ కు అవసరమయ్యే కుర్చీలు, టేబుల్, సీలింగ్ ఫ్యాన్ అందించాము. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మేకల రాములు, శక్తి కేంద్రం ఇంచార్జ్ గంగాధర్ గుప్తా, బూత్ అధ్యక్షులు కంది పెద్ద మల్లేష్, ఉల్లెంగ గోపి, పవన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com



# బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు

**కండువాతో పార్టీలోకి ఆహ్వానించ మాజీ ఎమ్మెల్యేలు గణేష్ బిగాల, జీవన్ రెడ్డి**

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ జిల్లా ప్రతినిధి





నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీలో బారీ చేరికలు జరిగాయి. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్ 12, 30, 31 నుంచి భారీ మైనార్టీ యువత గులాబీ కండువా కప్పుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి సాదరంగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా మాట్లాడారు. మహ్మద్ ఇర్ఫాన్, అబ్దుల్ మాజీద్, జైను, నయీం, అలీం, షారూఖ్ నేతృత్వంలో భారీగా చేరికలు జరిగాయి. బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం అధికారంలో లేనప్పటికీ చేరుతామని మైనార్టీ యువత పెద్ద ఎత్తున ముందుకు రావడం ఆనంద దాయకంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం అధికారంలో లేదని, ఎవరైనా ఆశ పడితే, సంపాదించుకోవాలంటే అధికార పార్టీ కాంగ్రెస్ లోకి వెళ్తారు కానీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఏమీ చేస్తలేదని ప్రజలంతా గ్రహించారన్నారు. పేదల ప్రభుత్వంగా బీఆర్ఎస్ కు గుర్తింపు ఉందన్నారు. మా పాలనలో కేసీఆర్ కిట్, షాదీ ముబారక్, ఆసరగా ఫించన్లు అనేక పథకాలను అమలు చేశామన్నారు. ఇలా పేదల కోసం ఆలోచించిన వ్యక్తి కేసీఆర్. మా హయాంలో నిజామాబాద్ అర్బన్ లో గల్లీ గల్లీలో చమ్కా దియే, ఇప్పుడు నిజామాబాద్ హాలత్ మొత్తం ఖరాబ్ అయ్యిందన్నారు. ఇప్పుడున్న ఎమ్మెల్యే ఒక్క చెట్టు పెట్టలేదని, పెట్టిన చెట్టుకు నీళ్లు పోస్తలేదన్నారు. స్తంభాలకు విద్యుత్ వెలిగిస్తే అదే ఇప్పుడు పెద్ద ముచ్చటని, నిజామాబాద్ మా హయాంలో మెరిసింది కానిప్పుడు చీకట్లో గుడ్డిగా కనిపిస్తుందన్నారు. ఆ మెరుపుల ఇప్పుడు లేవని, రాత్రి పూట సిటీని చూస్తే ఒక్క లైట్ వెలుగుతలేదని, అందుకే ఇదంతా చూసి బీఆర్ఎస్ పార్టీలోకి వచ్చారన్నారు. వచ్చే కాలమంతా బీఆర్ఎస్ పార్టీదేనని, సీఎం అయ్యేది కేసీఆర్ మాత్రమే అని, కొద్ది కాలం తర్వాత 10 ఏళ్లలో ఎవరికైనా వ్యతిరేకత వస్తుందన్నారు. పదేళ్లలో మాకు వచ్చింది కానీ కాంగ్రెస్ పార్టీకి 10నెలల్లోనే వ్యతిరేకత వచ్చిందన్నారు. సర్వే రిపోర్ట్ లో ఇప్పుడు ఎన్నికలు జరిగితే 10 ఎమ్మెల్యే సీట్లు కూడా రావని తేలిందన్నారు. మాకు మద్ధతు తెలపండి... మాకు అండగా నిలవండి... మీకు మేమున్నామంటూ గులాబీ పార్టీ శ్రేణులకు, మైనార్టీ నాయకులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్, మాజీ నూడా చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, సుజిత్ సింగ్ ఠాకూర్, సత్య ప్రకాష్, జగత్ రెడ్డి, నవీద్ ఇక్బాల్, మతిన్, ఇమ్రాన్ శేహజాద్, సనావుల్లా తదితరులు పాల్గొన్నారు.

# గాంధారిలో ఘనంగా కుస్తీ పోటీలు...

టైమ్స్ ఆఫ్ వార్త - గాంధారి





గాంధారి మండల కేంద్రంలో సోమ వారం కుస్తీ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలు ఆద్యంతం రసవత్తరంగా జరిగాయి. మల్లయోధులు గెలుపు కోసం ఉడుం పట్టు పట్టారు. మండల కేంద్రంలో ఏటా శ్రీరామనవమి మరుసటి రోజు కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందాని తెలిపారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఎంతో ఉత్సాహంగా కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మహారాష్ట్ర , కర్ణాటక రాష్ట్రాల నుండే కాకుండా చుట్టుపక్కల గ్రామాల మల్ల యోధులు వచ్చి పాల్గొన్నారు. ఈ పోటీల్లో 6 తులాల వెండి కడెం కుస్తీ పోటీ గాంధారికి చెందిన దొల్లు సంజీవ్ గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తూర్పు రాజులు, పున్న రాజయ్య, కల సుందర్, వెంకట్ గౌడ్, ఆకుల లక్ష్మణ్, పత్తి సాయిలు, రెడ్డి రాజులు, స్థానిక ఎస్ఐ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు,నితిన్,బాబా పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు , యువకులు పాల్గొన్నారు..

# కల్తీ కల్లు తాగడం వల్ల అస్వస్థత...

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



కల్తీ కల్లు తాగి పలువురు అశ్వత్థకు గురైన ఘటన గురువారం చోటుచేసుకుంది. నస్రుల్లా బాద్ మండలం అంకోల్ తండా, దామరంచ, అంకోల్, దుర్కి గ్రామాలలో కల్తీ కల్లు తాగిన పలువురు వ్యక్తులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు హుటాహుటిన బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో ముగ్గురు చికిత్స పొం దుతున్నారు. బాధితుల మెడ వంకర్లు తిరిగిపోవడంతో కుటుంబ సభ్యులు బాయందులను వ్యక్తం చేస్తున్నారు. నాలుక తిమ్మిర్లు వచ్చి మాట్లాడలేకపోతున్నారు. కొందరి పరిస్థితి విషమంగా ఉండడంతో నిజాంబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# అంబలి కేంద్రాన్ని ప్రారంభించిన పోచారం

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ

పట్టణంలోని తాడ్కోల్ చౌరస్తాలో నాగులగామ గిర్మయ్య జ్ఞాపకార్థం నాగులగామ వెంకన్న గుప్తా ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. వేసవి కాలంలో ప్రతి సంవత్సరం మాదిరిగా ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభనిందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, పిట్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపేట గ్రామానికి చేరుకున్న ప్రారంభోత్సవ అంబేద్కర్ విగ్రహం...




టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ గ్రామీణ మండలం ఇబ్రహీంపేట్ గ్రామంలో ఏప్రిల్14 వ తారీకు అంబేద్కర్ విగ్రహం ప్రారంభోత్సవం చేసే అంబేద్కర్ విగ్రహాన్ని మెట్టుపల్లి నుంచి సోమవారం ఇబ్రహీంపేట్ గ్రామ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మాదరి శివయ్య ,ఉపాధ్యక్షులు శెట్లూరు పెద్ద సాయిలు, ప్రధాన కార్యదర్శి పాశం భూమయ్య, క్యాషియర్ శెట్లూరు చిన్న సాయిలు, గ్రామానికి తీసుకురావడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామానికి తీసుకొచ్చిన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన బాన్సువాడ డివిజన్ అంబేద్కర్ సంఘం నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు మైసయ్య, జిల్లా ఉపాధ్యక్షులు గైని రవి, డివిజన్ ఉపాధ్యక్షులు మన్నె చిన్న సాయిలు దాదేకర్ సురేష్ . ఈ కార్యక్రమంలో గ్రామ అంబేద్కర్ యువజన సంఘం కమిటీ సభ్యులు సంగయ్య, బేగరి మొగులయ్య ,జలయ్య, కాలే పుండలిక్, నాగనాథ్, తదితరులు, పాల్గొన్నారు.

# ఎస్ ఆర్ ఎన్ కె డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల సన్నాహక సమావేశం

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని ఎస్ ఆర్ ఎన్ కె డిగ్రీ కళాశాలను సందర్శించి ఎస్ ఆర్ ఎన్ కె డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల గురించి సమీక్ష సమావేశం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహా దారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనస భ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి , రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు. ఎస్ ఆర్ ఎన్ కె డిగ్రీ కళాశాలలో ఎస్ ఆర్ ఎన్ కె కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణపై కమిటీ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులతో చర్చించి ఈనెల 24వ తేదీన కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించాలని నిశ్చయించారు.ఈ సిల్వర్ జూబ్లీ వేడుకకు కళాశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, కళాశాలలో విద్యను అభ్యసించి వివిధ హోదాల్లో ప్రభుత్వ,ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్న అందరూ తప్పకుండా హాజరై సిల్వర్ జూబ్లీ వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కమిటీ సభ్యులు, అధ్యాపక బృందం, నాయకులు, విద్యార్థిని, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

# ముదురుతున్న ఎండలు.. ఉద్యోగుల బేజారు..

- **సమయవేళల మార్పుకై సింగరేణి కార్మికుల ఎదురుచూపులు..**

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-




వేసవికాలంలో ఎండలు రోజురోజుకు ముదురుతున్నాయి. పెరుగుతున్న ఎండల దృష్ట్యా ప్రతిరోజు మధ్యాహ్నం సమయంలో కార్మికులు విధులకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు విలవిల మాడుతున్నారు. ప్రస్తుతానికి వేసవి ఉపశమన చర్యల కింద ఓసీపి లలో మాత్రం మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇస్తున్నా, డిపార్ట్మెంటల్ అవుట్డోర్లో పనిచేసే కార్మికులకు, గనులపైన ఎండవేడికి ఉపరితలంలో పనిచేసే కార్మికులకు మాత్రం మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వడం లేదు.

## సమయ వేళల మార్పుపై స్పందించని గెలిచిన సంఘాలు

గతంలో వేసవి సమయంలో ఎండల వేడిని దృష్టిలో ఉంచుకొని మొదటి షిఫ్ట్, రెండో షిఫ్ట్ కార్మికుల పని వేళలు యాజమాన్యం మార్చేది కానీ రాను రాను ఈ ఆనవాయితీని గెలిచిన సంఘాల అలసత్వముతో యాజమాన్యం మర్చిపోయింది. నేడు పోరాటాల యూనియన్ ఏఐటియుసి గెలిచిన ఇప్పటికే సమయవేళ మార్పుపై ఎక్కడ స్పందించకపోవడం గమనార్హం.

## ఓసి లకి తప్ప మిగతా సర్ఫేస్ కార్మికులకు లేని మజ్జిగ ప్యాకెట్లు

వేసవి ఉపశమన చర్యల కింద ప్రతి సంవత్సరం మాదిరిగానే మజ్జిగ ప్యాకెట్లు ఓపెన్ కాస్ట్ లలో పనిచేస్తున్న కార్మికులకు యాజమాన్యం ఇవ్వడం ప్రారంభించింది, అదేవిధంగా గనుల లో, ఉపరితలంలో పనిచేసే కార్మికులకు కానీ వర్క్ షాప్, సివిల్ నుండి అవుట్ డోర్ లలో పనిచేస్తున్న కార్మికులకు గాని, సిహెచ్పీ లలో పనిచేస్తున్న కార్మికులకు సైతం మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వడం లేదు అని, ఎండ వేడిమి అందరికీ ఒకేలా ఉన్న ఉత్పత్తి వచ్చే ఓపెన్ కాస్ట్ లలో పనిచేస్తున్న కార్మికులను పట్టించుకున్నట్లు బయట ఎండ వేడిమికి పనిచేస్తున్న ఇతర కార్మికులను పట్టించుకోకపోవడం వివక్షేనని పలువురు కార్మికులు గుసగుసలాడుకుంటున్నారు. ఓపెన్ కాస్ట్ పరిధిలో గల సిహెచ్పీ లలో పనిచేస్తున్న కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు ఇచ్చే యాజమాన్యం ఆయా ఏరియాల పరిధిలోగల సిహెచ్పీ లలో పనిచేస్తున్న కార్మికులకు ఇవ్వడం లేదు. మరోవైపు కొన్ని ఏరియాలలో ఓపెన్ కాస్ట్ లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు మజ్జిగ ప్యాకెట్లు ఇచ్చే యాజమాన్యం మిగతా ప్రాంతాల్లో పనిచేసే సెక్యూరిటీ గార్డుల పట్ల సైతం వివక్ష చూపుతుంది.



## అస్వస్థతకు గురయ్యే అవకాశం

ఎండ వేడికి పనిచేయడం వలన అస్వస్థతకు గురయ్య అవకాశం ఎక్కువగానే ఉంటుందని, అందులో భాగంగానే ఓపెన్ కాస్ట్ కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు ఇస్తున్న మిగిలిన ఎండ వేడిమికి పనిచేసే కార్మికులకు సైతం ఇవ్వాలనే డిమాండ్ కార్మికుల నుండే కాకుండా ప్రతిపక్షాలు సైతం డిమాండ్ చేస్తున్నారు. అయినా పోరాటాల సంఘం ఏఐటియుసి గుర్తింపు సంఘంగా గెలిచిన ఇతర డిపార్ట్మెంట్,గనులలో పనిచేసే కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని మాత్రం అడగడం లేదు. ప్రతిపక్షాలు అడుగుతున్న గుర్తింపు సంఘం అడగడం లేదని, యాజమాన్యం పట్టించుకోవడం లేదు. యాజమాన్యం ఎండ వేడిమి కి పనిచేసే అందరు కార్మికులను ఒకే మాదిరిగా చూసి, మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని కోరుతున్నారు.

## ఎండల వేడిని దృష్ట్యా సమయ వేళలను సవరించాలి

**ఎస్సిఈయు (సిఐటియు) మందమర్రి బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్ వెంకటస్వామి**



కేవలం ఉత్పత్తి పైన శ్రద్ధ కాకుండా కార్మికుల సంక్షేమం దృష్ట్యా మొదటి రెండవ షిఫ్ట్ కార్మికులకు సమయ వేళలను మార్చాలని అవుట్డోర్లో పనిచేసే వర్క్ షాప్,సివిల్, సెక్యూరిటీ కార్మికులతో పాటు అన్ని సిహెచ్పిలలో పనిచేసే కార్మికులకు సైతం మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని, గుర్తింపు సంఘం తన బాధ్యతగా యాజమాన్యంలో ఒప్పించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు)గా డిమాండ్ చేస్తున్నాము.

# నసురుల్లాబాద్ మండల కేంద్రంలో బిజెపిలో చేరిన మైనార్టీ నాయకుడు సమీర్



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ

బాన్సువాడ నియోజకవర్గం నసురుల్లాబాద్ మండలంలోని బస్వాయిపల్లి గ్రామానికి చెందిన మైనారిటీ సోదరుడు సమీర్ సోమవారం మండల అధ్యక్షులు సున్నం సాయిలు ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. కార్యక్రమంలో భాగంగా సున్నం సాయిలు పార్టీ కండువా కప్పి అతనికి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సమీర్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు, నరేంద్ర మోడీ నాయకత్వం వారు అనుసరించే విధానాలకు ఆకర్షితుడినై బిజెపి పార్టీలో సభ్యుడిగా చేరానని తెలియజేశారు. భవిష్యత్తులో నాలాంటి యువకులు ఎంతోమంది భారతీయ జనతా పార్టీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని అటువంటి వారిని సంఘటితం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మేకల రాములు, శక్తి కేంద్రం ఇంచార్జ్ గంగాధర్ గుప్తా, బూత్ అధ్యక్షులు కందిపెద్ద మల్లేష్, ఉల్లెంగ గోపి, పవన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిర్పూర్ విద్యార్థులు అభినందనీయులు



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

విశ్వాసు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన కవి సమ్మేళనంలో పాల్గొని బహుమతులను అందుకున్న సిరిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అభినందనీయులు అని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొని మాట్లాడుతూ సిర్పూర్ విద్యార్థులు కవిచారచనలో రాణిస్తూ జిల్లా స్థాయి రాష్ట్రస్థాయి బహుమతులను అందుకోవడమే కాకుండా ఇటీవల ఉగాది కవి సమ్మేళనంలో సీనియర్ కవులతో పాటుగా పాల్గొని తమ కవితలను వినిపించి జిల్లా విద్యాశాఖ అధికారి పి. అశోక్ చేతుల మీదుగా సన్మానాలను అందుకోవడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల తరఫున అభినందనలు తెలుపుతూ పుస్తకాలను బహుకరించారు. కవి సమ్మేళనం సత్కారాలను అందుకున్న బాల కవులు యం. మాధురి, యం. మేఘన, హారిణి, కే. గాయత్రి, యన్. చేత్ర, కే. కృతిక లను ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల మార్గదర్శి తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ కాసర్ల నరేష్ రావు, ఉపాధ్యాయులు మోహన్, వందన, అక్బర్ బాషా, గాయత్రి, నీలేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
మంగళవారం, 08-04-2025


# హెచ్‌సియు విద్యార్థులపై కేసుల ఉపసంహరణ

(మొదటి పేజీ తరువాయి)..



కేసుల ఉపసంహరణ క్రమంలో ఎటువంటి న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీస్ అధికారులకు తగిన సూచనలు చేయవలసిందిగా న్యాయశాఖ అధికారులను ఆదేశించారు.

## డిమాండ్లపై సానుకూలంగా స్పందించిన మంత్రుల కమిటీ

హెచ్‌సియు క్యాంపస్ నుండి పోలీసు బలగాలను వెంటనే ఉపసంహరించుకోవాలి, నిషేధాజ్ఞలను వెనక్కి తీసుకోవాలని, ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై ఇటీవల నమోదు చేసిన అన్ని కేసులను ఉపసంహరించుకోవాలని హెచ్‌సియు టీచర్స్ అసోసియేషన్, పౌర సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఇప్పటికీ పోలీసు కస్టడీలో ఉన్న ఇద్దరు విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని, కేంద్ర సాధికార కమిటీ క్యాంపస్‌ను సందర్శించే ముందు 400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూమిలో నష్టం అంచనా, జీవవైవిధ్య సర్వే నిర్వహించడానికి నిపుణులైన అధ్యాపకులు, పరిశోధకులకు అనుమతి ఇవ్వాలని మంత్రుల కమిటిని కోరారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం తక్షణం నెరవేర్చక పోవడంతో విద్యార్థి జాయింట్ యాక్షన్ కమిటీ ఈ సమావేశానికి హాజరు కాలేదని యుహెచ్‌టిఎ, సివిల్ సొసైటీ ప్రతినిధులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ డిమాండ్లు నెరవేర్చిన తర్వాతే విద్యార్థి జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మంత్రుల కమిటీ నిర్వహించే సమావేశానికి హాజరవుతారని తెలిపారు. కాగా, యుహెచ్‌టిఎ, సివిల్ సొసైటీ ప్రతినిధుల డిమాండ్లపై మంత్రుల కమిటీ సానుకూలంగా స్పందించింది. ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారం, పేర్కొన్న 400 ఎకరాల భూమిని రక్షించడానికి పోలీసుల పహారా తప్పనిసరి అని త్రిసభ్య మంత్రుల కమిటీ తెలిపింది. క్యాంపస్‌లోని మిగిలిన ప్రాంతాల నుండి పోలీసులను ఉపసంహరించుకోవాలనే అంశం గురించి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌కు ప్రభుత్వం నుంచి లేఖ రాస్తాయని పేర్కొంది. విద్యార్థులు, వసతి గృహాల భద్రత గురించి విసి హామీ ఇచ్చిన తర్వాత, 400 ఎకరాల్లో మినహా, క్యాంపస్ నుండి పోలీసులను ఉపసంహరించుకుంటామని తెలిపింది. విద్యార్థులపై ఉన్న కేసులను ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌కు సంబంధించి, హెచ్‌సియు విద్యార్థులపై దాఖలైన కేసుల పట్ల సానుభూతితో కూడిన దృక్పథానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రుల కమిటీ హామీ ఇచ్చింది. అంతే కాకుండా, సాధ్యమైనంత త్వరగా కేసుల ఉపసమహారణకు పోలీసు శాఖ, న్యాయ శాఖతో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాన్ని దృష్టిలో ఉంచుకుని, తదుపరి కోర్టు ఆదేశాలు జారీ చేసే వరకు అధ్యాపకులు, విద్యార్థులు సహా ఎవరిని 400 ఎకరాల్లో సర్వేకు అనుమతించలేమని స్పష్టం చేసింది. విద్యార్థులు కోరిన విధంగా యూనివర్సిటీని సందర్శించడానికి కమిటీ అనుకూలంగా ఉందని, కానీ సుప్రీంకోర్టులో కేసు కొనసాగుతున్న దృష్ట్యా న్యాయపరమైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికిప్పుడు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి మంత్రుల బృందం రాలేదని చెప్పింది. అయితే ఈ విషయంపై విద్యార్థుల సూచనలు, సలహాలు వినడానికి మంత్రుల కమిటీ సిద్ధంగా ఉందని స్పష్టం చేసింది. ఈ సమావేశంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు ప్రొఫెసర్ సౌమ్య దేచమ్మ సిసి, ప్రొఫెసర్ శ్రీపర్ణ దాస్, ప్రొఫెసర్ భంగ్య భూక్య, పౌర సంఘాల ప్రతినిధులు విస్సా కిరణ్‌కుమార్,ఎన్ఎపిఎం, వి.సంధ్య, డబ్లూటిజెఎసి ప్రతినిధులు కె.సజయ, ఇమ్రాన్ సిద్ధిఖీ, సిడబ్లూఎస్ -ఇండియా తదితరులు పాల్గొన్నారు.

# మే 7 నుంచి ఆర్టీసీ కార్మికుల సమ్మె

(మొదటి పేజీ తరువాయి)..




విమర్శించారు. టీజీఎస్‌ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పిలుపు మేరకు సోమవారం చలో లేబర్ కమిషనర్ ఆఫీస్ ఆందోళన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు హాజరయ్యారు. జేఏసీ చైర్మెన్ ఈదురు వెంకన్న (ఎంప్లాయీస్ యూనియన్), కో చైర్మెన్ కే హన్మంతు ముదిరాజ్ (టీజేఎమ్‌యూ), వైస్ చైర్మెన్ ఎమ్ థామస్‌రెడ్డి (టీఎమ్‌యూ), కన్వీనర్ ఎమ్‌డీ మౌలానా (ఎన్‌ఎమ్‌యూ), కో కన్వీనర్లు కత్తుల యాదయ్య (బీకేయూ), సుద్దాల సురేష్ (బీడబ్ల్యూయూ), బీ యాదగిరి (కార్మిక పరిషత్) మాట్లాడారు. సమ్మె నోటీసులో 21 అంశాలను ప్రస్తావించామని తెలిపారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీని కూడా అమలు చేయలేదని ఆక్షేపించారు. ఆపార్టీ మ్యానిఫెస్టోలో కార్మిక సంఘాలను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారనీ, దాన్నీ ఆచరణలోకి తేలేదన్నారు. మార్చి నెల వేతనాన్ని సంస్థలో కొందరికే చెల్లించారనీ, మిగిలిన వారికి 7వ తేదీ వచ్చినా జీతాలు ఖాతాల్లో జమ కాలేదన్నారు. 2017 వేతన సవరణ బకాయిలు చెల్లించలేదనీ, రిటైర్డ్ ఉద్యోగులకు 2017 వేతన ఫిక్సేషన్లు లేవనీ, అలవెన్సులు ఇవ్వలేదనీ, 2021 వేతన సవరణ గడువు ముగిసినా, దాని ప్రస్తావనే తేవట్లేదని యాజమాన్యం, ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎలక్ట్రిక్ బస్సుల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఆర్టీసీకి సరఫరా చేయాలనీ, అద్దె బస్సులు వద్దని డిమాండ్ చేశారు. సీసీఎస్, ఈపీఎఫ్ సహా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఈయూ అధ్యక్షులు ఎస్ బాబుతో పాటు పలువురు జేఏసీ నేతలు పాల్గొన్నారు. అంతకుముందు జేఏసీ నేతలు లేబర్ కమిషనర్‌తో భేటీ అయ్యారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందుకు ఆర్టీసీ యాజమాన్యం చర్చలకు రాలేదని కమిషనర్ తెలిపారు. దీనిపై జేఏసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ ఒక్క ఆర్టీసీ ఉద్యోగి, అధికారికి ఓటు హక్కు లేదనీ, అలాంటప్పుడు ఎలక్షన్ కోడ్ ఏంటని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారంలో కార్మిక శాఖ ఉద్దేశ్యపూర్వకంగానే జాప్యం చేస్తున్నదని విమర్శించారు.

# ప్రమాదకర స్థాయిలో అప్పుల భారతం



## ● భారీ నిరసన ఉద్యమానికి కాంగ్రెస్ సమయత్తం

(మొదటి పేజీ తరువాయి)..

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వివరించారు. గత 11 సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తున్న ఎన్ డి ఏ నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ ప్రజలకు నిత్యవసర వస్తువుల ధరలతో పాటు ఇతరేతర రకాలుగా ధరలను పెంచుతూ షాకులపై శాకులు ఇస్తున్న విషయం దేశ ప్రజలకు తెలిసిందే అని అన్నారు. ఇటీవల కాలంలో అధికార కాంక్షతో దేశ ప్రజలను విభజించేందుకు బిజెపి పార్లమెంట్లో ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లు దేశంలోని రాజకీయ పార్టీలతో పాటు కేంద్ర ప్రభుత్వాన్ని మద్దతు ఇస్తున్న పార్టీ లలో కూడా చిచ్చు పెట్టిందన్న విషయం తెలిసిందే అని ఆయన అన్నారు. ఇదే అదునుగా దేశంలోని అన్ని వర్గాల ప్రజల దృష్టిని మళ్లించేందుకు, రాత్రికి రాత్రి పార్లమెంట్లో వక్ఫ్ బిల్లును నెగ్గించుకున్న విధంగా ట్రంప్ ఎక్సైజ్ సుంకాల పెరుగుదల పేరుతో పెట్రోల్, డీజిల్ ప్రతి లీటర్ పై రెండు రూపాయలు, 14.2 కేజీల గ్యాస్ సిలిండర్ పై రూ.50ల చొప్పున పెంచుతూ దేశ ప్రజలకు విధ్వంసకర నిర్ణయం తీసుకోవడం మోడీ ప్రభుత్వానికి చెల్లుతుందని ఆయన ఆశ్చర్యచకితులయ్యారు. అంతేగాక కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఉజ్వల యోజన పథకం కింద పేద ప్రజలకు వారు అందజేస్తున్న సిలిండర్ పై కూడా రూ.50లు పెం చడం, ఈ ధరలన్ని సోమారం అర్ధరాత్రి నుండి అమలౌతున్నాయని ప్రకటించడం పట్ల పేద వర్గాలకు చెందిన మహిళలు ఆశ్చర్యచకితులౌతున్నారని తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆవేదన వ్యక్తపరి చారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణ యాల పట్ల భారతదేశంలోని పేద మధ్య తరగతి కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని బిర్ల ఐలయ్య ఆవేదన వ్యక్తపరిచారు. ఇప్పటికే దేశంలో అవకాశం అంటుతున్న నిత్యవసర ధరల కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న తరుణాన కేంద్రం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం సామాన్య ప్రజల జీవితాలకు గుధి బండగ మారు తుందని ఆయన వివరించారు. దేశ ప్రజలకు నమ్మించి, కులాల, మతాల విభజన పేరుతో మోసం చేయటం కేంద్ర ప్రభుత్వానికి పరిపాటుగా మారిందని ఆయన విమర్శించారు. కేంద్రం. పెంచిన చమురు ధరలను తగ్గించేంతవరకు కాంగ్రెస్ పార్టీ అలుపెరుగని ప్రజా ఉద్యమాన్ని ప్రజల్లో తీసుకపోతుందని బీర్ల ఐలయ్య హెచ్చరించారు. అంతేగాక జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ పేరుతో గ్రామ గ్రామాన చేపడుతున్న ఉద్యమంలో భాగంగా కేంద్రం పెంచిన ధరలను తగ్గించేంతవరకు కాంగ్రెస్ పార్టీ ఉద్యమాన్ని నిర్వహిస్తున్నదని బీర్ల ఐలయ్య వివరించారు.

# బిజెపి ఎమ్మెల్సీలను సన్మానించిన ఎమ్మెల్యే ధన్ పాల్

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ జిల్లా ప్రతినిధి



ఉమ్మడి కరీంనగర్, నిజామాబాదు, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల శాసనమండలి సభ్యులుగా నేడు ప్రమాణస్వీకారం చేసిన టీచర్ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డిని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఇందూర్ అర్బన్ శాసనసభ్యుడు ధన్ పాల్ సూర్యనారాయణ శాలువాతో సత్కారించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు తెలంగాణాలో బిజెపి అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ మోసపూరిత పాలన అంతనికి ఇది ఆరంభం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు, హామీలు మరిచి మోసపురితంగా వ్యవహారిస్తున్న కాంగ్రెస్ కు మేధావులు, పట్టభద్రులు, టీచర్స్ అందరు ఏకం అయ్యి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణాలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా బిజెపి పార్టీ ముందుకు పోతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారానికి ప్రజలే బుద్ధి చెప్తున్నారని అన్నారు, కాంగ్రెస్, బిఆర్ఎస్ చీకటి ఒప్పందం తెలంగాణ ప్రజలందరు గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు రెండు పార్టీలను బొంద పెట్టడం ఖాయం అన్నారు.

# చేపల వలకు చుట్టుకొని యువకుడు మృతి

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి



చెరువులో చేపల వేటకు వెళ్లిన ఓ 28ఏండ్ల యువకుడు గల్లంతై మృతి చెందిన ఘటన ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామశివారులో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి..ములుగు జిల్లాకు చెందిన పొట్టబత్తుల శ్రీనివాస్ (28)అనే యువకుడు 12ఏండ్ల కింద ఎడపల్లి మండలంలోని జాన్కంపేట గ్రామానికి వలస వచ్చి భార్యతో జీవిస్తున్నాడు.వృత్తి రీత్యా డ్రైవర్ గా పనిచేస్తూ ఖాళీ సమయంలో చేపలు పట్టేవాడని ఈ క్రమంలో ఆదివారం ఉదయం చేపలు పట్టేందుకు స్థానిక రథం చెరువు వద్దకు వెళ్లాడని భార్య వరలక్ష్మి తెలిపింది.ఈమేరకు చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు చేపల వలకు చిక్కుకొని నీటిలో మునిగి మృతిచెందాడని ఆమె తెలిపింది.మృతుని భార్య వరలక్ష్మి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీ కృష్ణ రెడ్డి తెలిపారు. పోస్ట్ మార్టం నిమిత్తం శవాన్ని బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# కన్నులపండువగా శ్రీరాముని పట్టాభిషేకం...

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి



శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సారంగాపూర్ ఎన్సీఎస్ఎఫ్ షుగర్ ఫ్యాక్టరీ వద్దగల శ్రీ కోదండ రామాలయంతో పాటు ఎడపల్లి మండలంలోని ఏఆర్పి క్యాంపు గ్రామంలో ఆదివారం సీతారాముల కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించగా సోమ వారం శ్రీరాముని కన్నులపండువగా శ్రీరాముని పట్టాభిషేకం నిర్వహించారు. సీతారాముల విగ్రహాలకు అభిషేకాలు చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మహా పూర్ణహుతి నిర్వహించి తీర్థప్రసాద వితరణ చేశారు.అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు గ్రామస్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రెటరీని కలిసిన ఈగ సంజీవరెడ్డి



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ స్పోర్ట్స్

ఢిల్లీలో అర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి, ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్ దేవాను ఆయన నివాసంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎథిక్స్ అండ్ డిసిప్లేన్ కమిటీ చైర్మన్గా నూతనంగా ఎన్నుకోబడిన ఈగ సంజీవరెడ్డి, తెలంగాణ అర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అయిన పి. అరవింద్ కుమార్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈవెంట్ కమిటీ సభ్యుడిగా నియామకమైన సందర్భంగా సచిదేవాను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి,మరియు ఢిల్లీ బిజెపి అధ్యక్షుడు వీరేంద్ర సచ్ దేవా మాట్లాడుతూ నూతనంగా ఎన్నుకోబడిన ఈగ సంజీవరెడ్డిని, పి. అరవింద్ కుమార్‌ను అభినందించారు. క్రీడాకారులను, క్రీడాలను ప్రోత్సహించాలని, క్రీడాకారులకు కావాల్సిన వసతులు కల్పించాలని సూచించారని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో అర్చరీ ఫెడరేషన్ అఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి గుంజన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న ఆర్మీ పారా గ్లైడింగ్ విన్యాసాలు

## పారామోటర్ ఎక్స్ పెడిషన్ యాత్రకు స్వాగతం పలికిన అదనపు కలెక్టర్





టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ స్పోర్ట్స్

జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం సాయంత్రం ఆర్మీ అధికారుల నేతృత్వంలో నిర్వహించిన పారా గ్లైడింగ్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. 250వ ఏఓసీ కార్ప్స్ డే ను పురస్కరించుకుని సికింద్రాబాద్ ఆర్మీ కంటోన్మెంట్ ఆధ్వర్యంలో పారా మోటార్ ఎక్స్ పెడిషన్ -2025 పేరుతో యాత్రను చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీ నుంచి ప్రారంభం అయిన ఈ యాత్ర ఆగ్రా, కాన్పూర్, ఝాన్సీ, సాగర్, జబల్పూర్, పుల్గాంల మీదుగా సాగుతూ, సోమవారం సాయంత్రం నిజామాబాద్ నగరానికి చేరుకుంది. ఈ యాత్రకు జిల్లా యంత్రాంగం తరపున అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీ.జీ కళాశాల మైదానంలో సికింద్రాబాద్ ఆర్మీ కంటోన్మెంట్ లెఫ్టినెంట్ కల్నల్ అమృత్ నేతృత్వంలో నిర్వహించిన పారా గ్లైడింగ్ విన్యాసాలు అలరింపజేశాయి. ఎన్.సీ.సీ క్యాడెట్లకు, యువతీ యువకులకు పారా గ్లైడింగ్ పట్ల ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తూ, ఆసక్తిని పెంపొందింపజేశారు. ఈ యాత్రకు స్వాగతం పలికిన వారిలో డీ.ఎస్.ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డి, పోలీసు అధికారులు, ఎన్.సీ.సీ అధికారులు ఉన్నారు.

# బాలికపై 22 మంది గ్యాంగ్ రేప్

## వారం రోజుల పాటు దారుణం

న్యూఢిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో 22 మంది నిందితులు ఓ 19 ఏళ్ల యువతిని కిడ్నాప్ చేసి సామూహిక అత్యాచారం చేశారు. వారిలో ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులు వారం రోజులపాటు ఆ యువతిపై అతాచారం చేసినట్లు సమాచారం. పరారీలో ఉన్న మిగతా నిందితులను పట్టుకోడానికి పోలీసులు గాలిస్తున్నారు. ఉత్తర వారణాసిలోని లాల్‌పుర్‌కు చెందిన ఆ టీనేజర్ యువతి తన ఫ్రెండ్‌ను చూసేందుకు మార్చి 29న ఇంటి నుంచి బయల్దేరింది. ఇదివరలో ఆమె ఒంటరిగానే సురక్షితంగా వెళ్లివచ్చేది. కానీ ఆ రోజున మాత్రం ఆమె ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఏప్రిల్ 4న వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే రోజున కిడ్నాపర్లు ఆమెకు మత్తుమందు ఇచ్చి పండేపూర్ కూడలిలో వదిలిపెట్టారు. ఆమె సమీపంలోనే ఉన్న ఫ్రెండ్ ఇంటికి ఎలాగోలా చేరుకుంది. తర్వాత వారు ఆమెను ఇంటికి చేర్చారు. తనపై జరిగిన దారుణాన్ని ఆ యువతి తండ్రికి తెలుపగా కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిడ్నాపర్లు ఆమెను అనేక చోట్లకు తీసుకెళ్లి లైంగికంగా దాడికి పాల్పడ్డారని ఆ యువతి తెలిపినట్లు తెలుస్తోంది. ఆమెపై హుక్కా బార్‌లో, హొటల్‌లో, లాడ్జ్‌లో , గెస్ట్‌హౌస్‌లో ఇలా పలు ప్రాంతాల్లో 22 మంది బలాత్కరించారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసుకుని అదే రోజు రాత్రి హుకుల్ గంజ్, లల్లాపుర ప్రాంతాలకు చెందిన అనేక మందిని అరెస్టు చేశారు. నిందితుల్లో కొందరు మైనర్లు ఉన్నారని సమాచారం. అయితే పోలీసులు పూర్తి వివరాలు తెలుపడంలేదు. లైంగిక దాడి జరిగిందని మొదట్లో బాధితురాలుగానీ, ఆమె కుటుంబసభ్యులుగాని తెలుపలేదని, కానీ చివరికి లైంగిక దాడి జరిగిందని ఫిర్యాదు చేశారని స్థానిక సీనియర్ పోలీస్ అధికారి చంద్రకాంత్ మీనా తెలిపారు

**PRINTED, PUBLISHED & OWNED BY** MANKALA DASU, H.NO, 3-8-289, Road No. 2 SURYODAYA COLONY , LB NAGAR, HYDERABAD-36. PRINTED AT y.v. reddy, binding works, h.no.5-20, shivani hotel line, gurga nagar, Hyderabad-36, Telangana.Editor MANKALA DASU, RNI NO. **APTEL/2007/22828** CELL: 9705506999